


పుంగనూరు మార్పుపై సానుకూలత

తిరుపతిలో నగరిని కలపక పోవడంపై అసంతృప్తి

జిల్లా పునర్విభజనపై ఇదీ జనాభిప్రాయం



అసంతృప్తిలో ఆ మూడు మండలాలు!

జిల్లాల పునర్విభజనలో భాగంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల పట్ల పుంగనూరు నియోజకవర్గ ప్రజల్లో సానుకూలత వ్యక్తమైంది. నగరి నియోజకవర్గ ప్రజలు మాత్రం ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని ఆక్రోశం వెల్లగక్కుతున్నారు.జగన్ ప్రభుత్వంలో జరిగిన అవకతవకల నిర్ణయాన్ని చంద్రబాబు సరిదిద్దుతారని ఆశపడితే తీవ్ర నిరాశకు గురి చేశారంటున్నారు. - చిత్తూరు, ఆంధ్రజ్యోతి

రొంపిచెర్లకు పీలేరే అనుకూలం : పుంగనూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలను కొత్తగా ఏర్పాటుకానున్న మదనపల్లె జిల్లాలో కలిపారు. పుంగనూరు, చౌడేపల్లె, సదుం, సోమల మండలాలు మదనపల్లె జిల్లాలో కలవగా.. రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలు చిత్తూరు జిల్లాలోనే కొనసాగించనున్నారు. నాలుగు మండలాల ప్రజలు తమకు చిత్తూరు కంటే మదనపల్లె చాలా దగ్గర అంటున్నారు. పులిచెర్ల మండల వాసులు కూడా తమ మండలాన్ని చిత్తూరు జిల్లాలో కొనసాగించడం పట్ల సంతోషపడుతున్నారు. రొంపిచెర్ల విషయంలో మాత్రం ప్రభుత్వ నిర్ణయం సరైంది కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ మండలానికి పీలేరు అన్నివిధాలా అనుకూలంగా ఉన్నా, చిత్తూరులో ఉంచడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇచ్చిన హామీని ఎందుకు మరిచారు?

వైసీపీ ప్రభుత్వం చిత్తూరు జిల్లాను విభజించినప్పుడు నగరి నియోజకవర్గంలోని నగరి, నింద్ర, విజయపురం మండలాలను చిత్తూరు జిల్లాకు, పుత్తూరు, వడమాలపేట మండలాలను తిరుపతి జిల్లాకు కేటాయించింది.నగరి నుంచీ చిత్తూరుకు 75 కిలోమీటర్లు కాగా తిరుపతి 60 కిలోమీటర్లు. నింద్ర, విజయపురాల నుంచీ చిత్తూరు 90 కిలోమీటర్లు వుంటే తిరుపతి 80 కిలోమీటర్లు. చిత్తూరుతో పోలిస్తే తిరుపతి చేరువ. రవాణా సదుపాయాలు మెరుగ్గా వున్నాయి. విద్య, వైద్య అవసరాలకు చిత్తూరు కంటే తిరుపతిపై ఎక్కువ ఆధారపడుతున్నారు ఈ మూడు మండలాల ప్రజలు. దీనికి తోడు గత ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, పాదయాత్ర సమయంలో లోకేశ్, స్థానిక ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ నగరి నియోజకవర్గాన్ని పూర్తిగా తిరుపతి జిల్లాలో విలీనం చేస్తామని హామీలిచ్చారు.క్యాబినెట్ సబ్ కమిటీ కూడా అనుకూలంగా సిఫార్సు చేసినా హామీని నెరవేర్చకపోవడం పట్ల మూడు మండలాల ప్రజలు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు.టీడీపీ శ్రేణులు సైతం నైరాశ్యంలో పడ్డాయి.

రెవెన్యూ సమస్యలు సులువుగా పరిష్కారం



పుంగనూరు నియోజకవర్గాన్ని మళ్లీ మదనపల్లె రెవెన్యూ డివిజనులో కలపడం హర్షణీయం. పుంగనూరు జమీందార్లకు సంబంధించిన భూసమస్యల్ని గతం లో మదనపల్లె రెవెన్యూ డివిజన్ అధికారులు సులువుగా పరిష్కరించేవారు. పలమనేరు డివిజన్‌లో కలిపిన తర్వాత అక్కడి అధికారులు ఇబ్బంది పడేవారు. పుంగనూరుకు పక్కనే ఉన్న మదనపల్లె జిల్లాకేంద్రం కావడం, పుంగనూరు ఆ జిల్లాలో కలవనుండడం సంతోషకరం.

- శరత్, న్యాయవాది, పుంగనూరు

మదనపల్లె కంటే చిత్తూరే దగ్గర



పులిచెర్ల మండలాన్ని చిత్తూరు జిల్లాలోనే కొనసాగించడం మాకు సౌకర్యమే. 'మా మండలాన్ని చిత్తూరు జిల్లాలో కొనసాగించండి. లేదంటే తిరుపతి జిల్లాలో కలిపేయండి'అని ఇప్పటికే సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేశ్‌కు వినతులు ఇచ్చాం. 80 కిలోమీటర్ల దూరంలోని మదనపల్లె కన్నా, 40 కిలోమీటర్లలోని చిత్తూరు జిల్లా కేంద్రం మాకు దగ్గర.

- గోపి నాయుడు, ఎల్లంకివారిపల్లె, పులిచెర్ల మండలం

పీలేరు డివిజన్ సౌకర్యవంతం



సదుం మండల ప్రజలు గతంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి 60 కిలోమీటర్ల దూరంలోని పలమనేరు ఆర్డీవో వద్దకు వెళ్లేవాళ్లం. ఇప్పుడు సదుం మండలాన్ని పీలేరు రెవెన్యూ డివిజన్‌లో కలపడంతో ఆ సమస్య ఉండదు. జిల్లా కేంద్రం కూడా చిత్తూరు కంటే మదనపల్లె మాకు అనుకూలం.

-నజీర్, సదుం

రొంపిచెర్ల విషయం బాధాకరం



పుంగనూరు నియోజకవర్గాన్ని మదనపల్లె జిల్లాలో కలపడం సంతోషకరమే. కానీ, మా రొంపిచెర్ల మండలాన్ని చిత్తూరులో కొనసాగించడం బాధాకరం. మాకు చిత్తూరు 50 కిలోమీటర్ల దూరంలో వుంటే పీలేరు డివిజన్ కేంద్రం 13 కిలోమీటర్ల దూరంలో ఉంది. రొంపిచెర్లను చిత్తూరులో కాకుండా పీలేరు డివిజన్‌లో కలపాలని ఎక్కువ మంది ప్రజలు కోరుకుంటున్నారు.

-అమరనాథ రెడ్డి, జగడంవారిపల్లె, రొంపిచెర్ల మండలం

ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి



నగరి, పుత్తూరు ప్రాంతాల్లో జరిగిన ఎన్నికల సభల్లో చంద్రబాబు, లోకేశ్, గాలి భానుప్రకాష్ మూడు మండలాలను తిరుపతి జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక మాట తప్పడం దారుణం. హామీ నిలబెట్టుకోవాలి.

- గణేష్ పిళ్లై, విశ్రాంత ఉద్యోగి, నింద్ర

పునఃపరిశీలన చేయాలి



నగరి,నింద్ర, విజయపురం మండలాలను తిరుపతిలో కలిపే అంశాన్ని ప్రభుత్వ పెద్దలు పునఃపరిశీలించాలి. లేకుంటే విద్యార్థులకు, ఉద్యోగులకు ఇబ్బందులు తప్పవు.

- సమరసింహారెడ్డి, మల్లారెడ్డికండ్రిగ, విజయపురం మండలం

తిరుపతే మాకు సౌకర్యం



నగరి నుంచి తిరుపతికి రైలు సౌకర్యంతో పాటు ప్రతి 15 నిమిషాలకో బస్సు ఉంది. రవాణా సౌకర్యంతో పాటు విద్య, వైద్య సౌకర్యాలు కూడా తిరుపతిలోనే బాగున్నాయి. ఈ మూడు మండలాల ప్రజలకు తిరుపతితోనే అనుబంధం ఉంది. చిత్తూరుకు వెళ్లాలంటేనే నానా అవస్థలు పడాలి.

-ఈఎన్ శ్రీనివాసులు, కేవీపీఆర్‌పేట, నగరి మండలం

'రైతన్న - మీకోసం'లో అధికారులు పాల్గొనాలి

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొనసాగుతున్న 'రైతన్న - మీకోసం' కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. మూడవ రోజైన బుధవారం రైతన్న మీకోసం కార్యక్రమ అమలుపై అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వున్న 2.50 లక్షల రైతన్నల ఇండ్లకు వెళ్ళి ప్రభుత్వం అందించిన కల్టివేటర్ యాప్‌లో రైతులకు సంబంధించిన అన్ని వివరాలను నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్ళి సర్వే చేయాలని మండల వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. ప్రస్తుత సీజన్‌లో రైతులకు అన్నదాత సుఖీభవ ద్వారా నగదు జమ అయ్యిందో లేదో కూడా అడిగి తెలుసుకోవాలన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

కాలనీల్లో దేవాలయాల నిర్మాణానికి టీటీడీ సాయం

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానాల ద్వారా దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత్స్యకారుల కాలనీల్లో రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వ్యయంతో ఆలయాల నిర్మాణానికి సహకారం అందిస్తామని ఆ శాఖ సహాయ కమిషనర్ చిట్టెమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎ' కేటగిరిలో కనీసం ఐదు సెంట్లకు మించి స్థలముంటే రూ.10 లక్షలు, 'బి' కేటగిరిలో ఎనిమిది సెంట్లకు మించి స్థలముంటే రూ.15 లక్షలు, 'సి' కేటగిరిలో 10 సెంట్లకు మించి ఎక్కువ స్థలం ఉంటే రూ.20 లక్షలతో ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ కాలనీల్లో గతంలో ఆలయాలు లేకుండా నూతనంగా నిర్మించాలనుకునే వారికి ప్రభుత్వ సహకారం అందిస్తామన్నారు. ఇతర వివరాలకు చిత్తూరులోని దేవదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.



స్వామి దర్శనానంతరం ఆలయం వెలుపల ట్రస్టుబోర్డు సభ్యులు

వరసిద్ధుడి ఆలయ చైర్మన్‌గా సురేంద్రబాబు

ఐరాల(కాణిపాకం), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆలయ చైర్మన్‌గా సురేంద్రబాబు అలియాస్ మణి నాయుడు ఎంపికయ్యారు.ట్రస్టు బోర్డు సభ్యులు బుధవారం ఉదయం ఆలయ సమావేశ మందిరంలో ప్రమాణ స్వీకారం చేశాక సురేంద్రబాబును చైర్మన్‌గా ఎన్నుకున్నారు. కర్నూలుకు చెందిన ట్రస్టు బోర్డు సభ్యురాలు రాజ్యలక్ష్మి ప్రమాణ స్వీకారానికి హాజరు కాలేకపోయారు.బోర్డు సభ్యులైన సురేంద్ర బాబు, చంద్రశేఖర రెడ్డి, డాక్టర్ బీవీ.నరేష్,పరిమి చంద్రకళ, కేఎస్.అనసూయమ్మ, కత్తి సుధాకర రెడ్డి,సంధ్యారాణి దేవరకొండ, సునీత గుంటుపల్లె, కొత్తపల్లె శివప్రసాద్, నాగరాజు నాయుడు, శ్రీపతి సతీష్, పెరుమాళ్ల సుబ్బారెడ్డి, చల్లా కృష్ణవేణి,పి.పద్మలత, కనకరాజు,వసంతశ్రీవాణి బుధవారం ఉదయం ఎమ్మెల్యే మురళీమోహన్, ఆలయ ఈవో పెంచలకిషోర్ సమక్షంలో ప్రమాణం చేశారు.చైర్మన్ మణినాయుడు మాట్లాడుతూ సభ్యులందరం సమష్టిగా ఆలయ అభివృద్ధికి పాటుపడతామన్నారు. ఆలయంలో ఎలాంటి తప్పులు జరగకుండా చూస్తామన్నారు. అనంతరం బోర్డు సభ్యులంతా వినాయక స్వామిని దర్శించుకున్నారు.

నేడు భగవద్గీత పారాయణ పోటీలు

చిత్తూరు కల్చరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక తపోవనం ఉన్నత పాఠశాలలో గురువారం ఉదయం 9గంటల నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల, ఇంటర్ విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహిస్తున్నటు టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ భద్రావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు నుంచి తొమ్మిది తరగతి విద్యార్థులకు భగవద్గీతలోని గుణత్రయ విభాగ యోగం, 10 నుంచి ఇంటర్ స్థాయి వారికి దైవాసుర సంపద్విభాగయోగం శ్లోకాల పోటీలు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. 18 సంవత్సరాలు పైబడి 45 సంవత్సరాల లోపు ఉన్న వారికి నిత్యజీవితంలో భగవద్గీత అనే అంశంపై భావ విశ్లేషణ తదితర అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. పోటీల్లో గెలుపొందిన అభ్యర్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు, జ్ఞాపికలు అందజేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు, యువకులు ఈ పోటీల్లో పాల్గొనాలని ఆమె కోరారు.

తిరిగి డీటీఆర్బీకి సీఐ వాసంతి

చిత్తూరు అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు సీఐగా విధులు నిర్వహిస్తున్న వాసంతిని ప్రభుత్వం మాతృశాఖకు తిరిగి బదిలీ చేసింది. డిస్ట్రిక్ ట్రాన్స్‌పోర్ట్ రికార్డ్ బ్యూరో (డీటీఆర్బీ)లో సీఐగా వాసంతి విధులు నిర్వహించేవారు. అప్పటి ఎస్పీ మణికంఠ చందోలు గంగాధరనెల్లూరు ఇన్‌చార్జి సీఐగా వాసంతిని బదిలీచేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఎస్పీ తుషార్ డూడి ఆమెను మాతృశాఖకు బదిలీ చేశారు. గంగాధరనెల్లూరు ఇన్‌చార్జి సీఐగా నిత్యబాబును నియమించారు.

మండలానికో క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ పేరుతో ప్రభుత్వం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నెల రోజుల పాటు ఎంపిక చేసిన గ్రామాల్లో ఇందుకు సంబంధించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందుకు జిల్లాలో 31 మండలాల ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ తీసుకున్న మండల స్థాయి అధికారులు తమ పరిధిలోని ఒక గ్రామాన్ని ఎంచుకుని పచ్చదనం, పరిశుభ్రత, ఇతర అంశాల్లో ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతారు. దీన్ని మోడల్‌గా తీసుకుని మిగిలిన గ్రామాలను తీర్చిదిద్దాల్సివుంటుంది. కార్యాచరణకు పంచాయతీల నుంచి ప్రత్యేక నిధులు కేటాయించేలా చర్యలు చేపడతారు.అవసరమైన పంచాయతీల్లో తాత్కాలిక పద్ధతిపై పారిశుధ్య సిబ్బందిని నియమించేందుకు చర్యలు తీసుకోవాలి. ప్రతి మండలస్థాయి అధికారి వారంలో ఒక గ్రామానికి పర్యవేక్షణకు వెళ్లాలని ఉన్నతాధికారులు సూచించారు. జిల్లాలోని 697 పంచాయతీల్లో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఇందుకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. మండలంలోని హరిత రాయబారులు ఎంపిక చేసిన గ్రామానికి చేరుకుని ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. సిబ్బందికి చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ ఇచ్చారు. క్రమేణా దీన్ని అన్ని గ్రామాలకు వర్తింపజేస్తారు.

పాడిఆవుపై గజ దాడి

● 10 రోజులుగా తిష్టవేసిన 13 ఏనుగుల గుంపు





గజ దాడిలో గాయపడ్డ పాడిఆవు - జగమర్ల వద్ద రోడ్డు పక్కనే తిష్టవేసిన ఏనుగు

బంగారుపాళ్యం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):వరి పంటను తొక్కినాశనం చేసిన ఒంటరి ఏనుగు అక్కడే ఉన్న ఓ పాడిఆవును దంతాలతో పొడవగా అది తీవ్రంగా గాయపడింది. బంగారుపాళ్యం మండలం టేకుమంద బీటు పరిధిలోని మామిడిమానుకుంట సమీపంలో మంగళవారం రాత్రి ఒంటరి ఏనుగు వరి పొలాల్లోకి చొరబడి పంటను తొక్కి నాశనం చేసింది. టేకుమందకు చెందిన చంద్ర,జ్యోతీశ్వరయ్యలకు చెందిన వరి,అరటి పంటలను ధ్వంసం చేసింది. అదే గ్రామానికి చెందిన జానకిరామయ్య తన పాడిఆవును పొలం వద్ద కట్టేయగా ఏనుగు దంతాలతో దానిపొట్టపై పొడవడంతో పేగులు బయటకు వచ్చేశాయి. వీటి పెనుగులాటలో ఆవు కొమ్ములు కూడా విరిగిపోయాయని జానకిరామయ్య చెప్పాడు.రోజుకు 24 లీటర్ల పాలు ఇచ్చే ఆవు ప్రాణాపాయ స్తితికి చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. 10 రోజులుగా టేకుమంద,మొగిలివారిపల్లె. మొగిలి గ్రామ సమీపంలోని అటవీప్రాంతాల్లో 13 ఏనుగుల గుంపుతో పాటు ఈ ఒంటరి ఏనుగు పంటపొలాలపై దాడులు చేస్తూ రైతులను భయభ్రాంతులకు గురి చేస్తోంది. ఈ నెల 11వ తేదీన కౌసల్య,గోవిందయ్య,రేణుకమ్మలకు చెందిన వరి,మామిడి పంటలను ఏనుగులు నాశనం చేశాయని తెలిపారు. పొలాల వద్ద రాత్రి వేళ మంటలు వేసుకుని పంటలకు కాపలా కాయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

కుప్పం బాలికకు రాష్ట్రస్థాయి గుర్తింపు



కుప్పం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణానికి చెందిన బాలిక కె.తేజశ్రీ యోగా పోటీలలో రాష్ట్రస్థాయి గుర్తింపు పొందింది. కుప్పం పట్టణంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బాలిక తేజశ్రీ బాపట్ల పట్టణంలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన యోగా పోటీలలో రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం సాధించి ప్రతిభ నిరూపించుకుంది. పాఠశాలలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎన్.వెంకటేశ్వరబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు జి.పుష్ప, ఇతర ఉపాధ్యాయులు తేజశ్రీని అభినందించారు. ఇలాగే ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను వెలికితీసి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

డిప్యూటీ ఎంపీడీవోలుగా 65మందికి ప్రమోషన్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 65 మందికి డిప్యూటీ ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతి లభించింది. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో జిల్లాపరిషత్తు, జిల్లా పంచాయతీ, డీఎల్పీవో, మండల పరిషత్ కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న వారికి ప్రమోషన్ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి 19 మందికి, జిల్లా పరిషత్ నుంచి 46 మందికి ఉద్యోగోన్నతి లభించింది. చిత్తూరు జిల్లా వరకు 31 మండలాల్లో గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారులుగా నియమించే వారి జాబితాపై నేడో, రేపో కలెక్టర్ సుమిత్‌కుమార్ మండలాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేయనున్నారు.

నేడు సీఎంతో టీటీడీ చైర్మన్, ఈవో భేటీ

అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష

తిరుమల, నవంబరు26(ఆంధ్రజ్యోతి): అమరావతిలో గురువారం సీఎం చంద్రబాబును టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి కలవనున్నారు. ఇక్కడి వెంకటపాలెంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాకారం, కల్యాణోత్సవ మండపం, రాజగోపురం తదితర అభివృద్ధి కార్యక్రమాలకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం సీఎంతో వీరు భేటీ అవుతారు. గతంలో సీఎం సూచించిన అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలు, వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు వంటి వివిధ అంశాలపై ఈ సందర్భంగా సీఎం సమీక్షిస్తారు.



శైలేష్ కొలను - కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి

కొత్త ప్రాజెక్ట్ కోసం స్వామి ఆశీస్సులు తీసుకున్నా

తిరుమల, నవంబరు26(ఆంధ్రజ్యోతి): త్వరలో కొత్త ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్న క్రమంలో స్వామి ఆశీస్సులు తీసుకున్నానని 'హిట్' సినిమాల దర్శకుడు శైలేష్ కొలను వెల్లడించారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం తన నూతన ప్రాజెక్ట్ స్క్రిప్ట్‌తో ఆయన దర్శించుకున్నారు. సితార ఎంటర్టైన్మెంట్ నాగవంశీతో నూతన సినిమా ప్రారంభంకానుందన్నారు.

● తమిళనాడు తెలుగు యువశక్తి అధ్యక్షుడు, తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్ కౌన్సిల్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి కూడా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

4న తిరుమలలో కార్తీక దీపోత్సవం

తిరుమల, నవంబరు26(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబరు 4వ తేది కార్తీక పర్వ దీపోత్సవాన్ని టీటీడీ నిర్వహించనుంది. శ్రీవారికి సాయంకాల కైంకర్యాలు, నివేదనలు పూర్తయ్యాక ఆలయంలోపల, బయట అనుబంధ ఆలయాలు, పుష్కరిణి వద్ద నేతి వత్తులతో దీపాలను వెలిగిస్తారు.

హత్యకేసులో లొంగిపోయిన నిందితుడు

పాకాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పాకాల మండలం దామలచెరువుకు చెందిన మామిడి సప్లయర్, మెడికల్ షాప్ యజమాని ఈ యేడాది మే 1వ తేదీన దారుణహత్యకు గురైన సంఘటనలో మూడో నిందితుడు తిరుమల రాజు బుధవారం పాకాల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో లొంగిపోయాడు. న్యాయమూర్తి పూర్ణిమదేవి నిందితుడికి 14 రోజులు రిమాండు విధించారు. ఈ మేరకు పోలీసులు చిత్తూరు సబ్‌జైలుకు నిందితుడిని తరలించారు.

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.26 కోట్లు
మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,677
తలనీలాలు సమర్పించినవారు: 24,732



కాంచిన కనులదే భాగ్యం



పూలబుట్టలతో ఊరేగింపుగా టీటీడీ అధికారులు



● అమ్మవారికి వేడుకగా పుష్పయాగం

తిరుచానూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జాజులు, తామరలు, మల్లెలు, కలువలు, చామంతి, రోజా, మొల్లలు, కనకాంబరాలు, మొగలి రేకులు తదితర 12 రకాల పుష్పాలు. తులసి, మరువం, దవణం, బిల్వం, కదిర పచ్చ, పన్నీరు తదితర ఆరు రకాల పత్రాలు. వీటితో తిరుచానూరు పద్మావతి అమ్మవారికి బుధవారం అర్చకులు పుష్పయాగం నిర్వహించారు. కార్తీక బ్రహ్మోత్సవాల్లో జరిగిన ఆగమయుక్త కార్యక్రమాల్లో తెలిసో తెలియకో చోటు చేసుకున్న దోషాలకు ప్రాయశ్చిత్తంగా.. ఉత్సవాలు ముగిసిన మరుసటిరోజు పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా దాతల ద్వారా సేకరించిన నాలుగు టన్నుల పుష్పాలు, పత్రాలను గంపల్లో అమర్చి ఆస్థాన మండపంలో పూజలు నిర్వహించారు. ఆలయ ఉద్యోగులు, శ్రీవారి సేవకులు ఈ గంపలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. మధ్యాహ్నం 3గంటలకు యాగశాలలో ప్రాయశ్చిత, శాంతిహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం 5గంటలకు సన్నిధి నుంచి అమ్మవారిని వేంచేపుగా శ్రీకృష్ణ స్వామి ముఖమండపంలో కొలువు దీర్చారు. 8గంటల వరకు వేదమంత్రాలు పఠిస్తూ పుష్పాలను అమ్మవారిపై చల్లుతూ పుష్పాభిషేకం చేశారు. ఈ నాలుగు టన్నుల పుష్పాలను ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచీ దాతలు వితరణగా అందించినట్లు టీటీడీ ఉద్యానశాఖ అధికారిడిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు పుట్టింటి ఆతిథ్యం

పద్మావతీ అమ్మవారికి గురువారం మహంతు ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన రెండో రోజు అమ్మవారు తన పుట్టింటికి వెళ్లి ఆతిథ్యం స్వీకరించడంలో భాగంగా పద్మసరోవరం వద్దనున్న హథీరాంమఠంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఉత్సవాన్ని నిర్వహిస్తారు. కాగా, గురువారం నుంచి అమ్మవారి ఆలయంలో యథావిధిగా ఆర్జిత సేవలు జరుగుతాయని అధికారులు తెలిపారు.

నీకొకటి.. నాకొకటి

● అప్పుడు వారు.. ఇప్పుడు వీరు

● రుయాలో రెండు మెడికల్ షాపులను పంచుకున్న నేతలు

తిరుపతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో మెడికల్ మాఫియాకు బ్రేక్ పడిందని అనుకునేలోపే, పక్కనే ఉన్న రుయాస్పత్రికి విస్తరించింది. రాజకీయ నేతల ఒత్తిళ్లతో బుధవారం రెండు జనరిక్ మెడికల్ షాపులకు అనుమతిస్తూ నోట్‌ఫైల్ సిద్ధమైనట్లు తెలిసింది. ఇరు పార్టీలకు చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులు సిఫారసు లేఖలతో రెండు మెడికల్ షాపులను నామమాత్రపు అద్దెకు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. ఏకంగా రుయాలోని స్థలం కేటాయించి గదులను వారినే కట్టుకోమని సూచించినట్టు సమాచారం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రుయాస్పత్రిలో మెడికల్ షాపులకోసం నలుగురు నాయకుల నుంచి నాలుగు దరఖాస్తులు ఏడాది క్రితమే అధికారులకు అందాయి. ప్రతి ప్రభుత్వ వైద్యశాలలో జనరిక్ మెడికల్ షాపు ఉండాలని, వాటిని రెడ్‌క్రాస్ సొసైటీ మాత్రమే నిర్వహించాలని మే నెలలో రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దీంతో అధికారులు బయట వ్యక్తులకు కేటాయించలేకపోయారు.

ఇదిలావుంటే 2005లో టెండరు ద్వారా దక్కించుకున్న రెండు ప్రైవేట్ మెడికల్ షాపులు 2019వరకు రుయాకు అద్దెచెల్లిస్తూ నిర్వహించుకుంటూ వచ్చాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక బలవంతంగా ఖాళీ చేయించి, ఆపార్టీ అనుచరులకు కట్టబెట్టారన్న విమర్శలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కోర్టును ఆశ్రయించి మళ్లీ వాటిని పూర్వపు నిర్వాహకులే చేజిక్కుంచుకుని ఇటీవల ప్రారంభించారు. ఈ రెండు కాకుండా మరొకటి రెడ్ క్రాస్ సొసైటీ జనరిక్ మెడికల్ షాపు నిర్వహిస్తోంది. జీవో నెంబరు 516 నిబంధనల మేరకు వెయ్యి పడకలు దాటిన ఆస్పత్రిలో మూడు మెడికల్ షాపులు మాత్రమే ఉండాలి. ఆ మేరకు రుయాస్పత్రిలో ప్రస్తుతం 3 మెడికల్ షాపులు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మరో రెండు షాపులు కేటాయిస్తే రుయాలో మొత్తం 5 మెడికల్ షాపులు ఉన్నట్టు అవుతుంది. రాజకీయ ఒత్తిళ్లను తట్టుకోలేకనే రుయా అధికారులు మెడికల్ షాపులను కేటాయిస్తున్నట్టు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా అప్పగిస్తున్న మెడికల్ షాపులను హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించే కలెక్టర్ అనుమతి తీసుకున్నారా? లేదా? అన్న అనుమానం కలుగుతోంది.

నేడు ప్రముఖ రచయిత్రి ఓల్గా రాక

● తండ్రి పేర పద్మావతి వర్సిటీలో ధర్మనిధి సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగానికి గురువారం ప్రముఖ రచయిత్రి ఓల్గా రానున్నారు. తన తండ్రి పోపూరి వేంకట సుబ్బారావు పేర ఏటా ఏటా ధర్మనిధి సదస్సులో ఆమె పాల్గొంటారు. గురువారం ఉదయం 10 గంటలకు సావేరీ హాల్లో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది.

రైల్వే అధికారి మృతి

తిరుపతి (నేరవిభాగం), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో బుధవారం గుండెపోటుతో రైల్వే అధికారి మృతి చెందారు. తిరుపతి ఈస్ట్ ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపిన ప్రకారం.. ఏర్పేడు మండలం అంజిమేడుకు చెందిన మల్లిఖార్జునరెడ్డి (57)హైదరాబాదులో రైల్వే ఆఫీసు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. బుధవారం హైదరాబాదు నుంచి తిరుపతికి వచ్చారు. ఈ క్రమంలో రేణిగుంటలో దిగి టీ తాగి బంధువులతో ఫోన్‌లో మాట్లాడాడు. తిరుపతికి బస్సు చేరుకున్నా.. ఎంతసేపటికీ ఆయన దిగలేదు. అనుమానం వచ్చిన బస్సు డ్రైవర్ అతడి వద్దకు వెళ్లి చూడగా సొమ్మసిల్లి పడి ఉన్నారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని ఎస్‌ఐ చెప్పారు. జరిగిన ఘటనపై మృతుడు సోదరుడు దశరథరామయ్యకు సమాచారం ఇచ్చారు. అతడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు.

సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం

● ఎన్‌సీసీ ఏపీ-టీజీ డీడీజీ నర్సింగ్ సైలాని

● గిరిపురాన్ని దత్తత తీసుకున్న ఎన్‌సీసీ తిరుపతి గ్రూపు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇకపై సామాజిక సేవా కార్యక్రమాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తామని ఎన్‌సీసీ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (డీడీజీ) నర్సింగ్ సైలాని పేర్కొన్నారు. తిరుపతి ఎన్‌సీసీ గ్రూపును బుధవారం ఆయన సందర్శించారు. పచ్చదనం, పరిశుభ్రత వంటి కార్యక్రమాల్లో ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొనేలా చేస్తామన్నారు. తద్వారా ఎన్‌సీసీ క్యాడెట్లలో సేవా స్ఫూర్తి, నాయకత్వ లక్షణాల పెంపు, సామాజిక బాధ్యత అలవడేలా చూస్తామన్నారు. తిరుపతిలోని గిరిపురం ప్రాంతాన్ని ఎన్‌సీసీ తిరుపతి గ్రూపు దత్తత తీసుకుంది. నగరపాలక సంస్థ సహకారంతో పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణపై ఈ ప్రాంతంలోని ప్రజల్లో అవగాహన కల్పిస్తామని సైలానీ తెలిపారు. ఈ సమావేశంలో ఎంసీటీ ఆరోగ్యాధికారి అన్వేష్, ఎన్‌సీసీ అధికారులు సతీష్ దాహియా, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కారు, బస్సు ఢీ ● ఐదుగురికి తీవ్ర గాయాలు

పుత్తూరు అర్బన్, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): పుత్తూరు సమీపంలోని పరమేశ్వర మంగళం వద్ద కారు, బస్సు ఢీ కొన్నాయి. శ్రీకాళహస్తి నుంచి కంచికి వెళుతున్న కారు వాహనాన్ని అధిగమించబోయి కంచి నుంచి వస్తున్న తమిళనాడు ఆర్టీసీ బస్సును ఢీ కొంది. ఈ ప్రమాదంలో బస్సులోని ఐదుగురు ప్రయాణికులకు తీవ్రంగాను.. కారులో ప్రయాణిస్తున్న వారికి చిన్నపాటి గాయాలైనట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేయించి కాంచీపురం ఆస్పత్రికి పంపామన్నారు.

సెప్టిక్‌ట్యాంకు క్లీనింగ్ వాహనానికి దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతిజిల్లా పరిధిలో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాన్ని ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకం కింద పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల సేవాసహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకుడు విక్రమ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'జిల్లాలోని ఎస్సీలకు చెందిన సఫాయి కర్మాచారి వృత్తిలో ఉన్న వారు అర్హులు. ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తులు పంపాలి. మరిన్ని వివరాలకు 91007 56863 నెంబరులో సంప్రదించాలి' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

టీటీడీ మాజీ ఏవీఎస్వో కుటుంబానికి స్నేహితుల సాయం

తిరుపతి, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి):ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన టీటీడీ మాజీ ఏవీఎస్వో, జీఆర్పీ సీఐ వై. సతీష్ కుమార్ కుటుంబానికి ఆయన స్నేహితులు సాయమందించారు. 2012 ఏఆర్ అండ్ ఏపీఎస్పీ బ్యాచ్‌కు చెందిన సతీష్ కుమార్ ఈనెల 15వ తేది తిరుమల పరకామణి కేసు విచారణకు హాజరయ్యేందుకు రైల్లో బయల్దేరి అనూహ్యరీతిలో పట్టాలపై శవంగా దర్శనమివ్వడం సంగతి తెలిసిందే.ఈ నేపథ్యంలో బుధవారం సతీష్‌కుమార్ కర్మక్రియలకు హాజరైన ఆయన బ్యాచ్‌మేట్స్ అంతా కలసి కుటుంబానికి ఆర్థికసాయమందించారు.సతీష్‌కుమార్ తల్లి పేరిట 3లక్షలు, పిల్లల పేరిట 11లక్షలు చెక్కుల రూపంలో అందజేశారు. ఏపీ, తెలంగాణలకు చెందిన బ్యాచ్‌మేట్స్ మోడెం సురేష్, అర్జున్, నరసింహ, విజయకుమార్, షరీఫ్, రంగనాథ్, మాదప్ప,మనోహర్, శ్రీనివాస్, ప్రదీప్,సుధాకర రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



తిరుమల కొండల్లో ఏనుగుల జాడను గుర్తిస్తున్న వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ బృందం

'గజ' గమనం పరిశోధిస్తున్నాం

● వైల్డ్ లైఫ్ ఇండియా ప్రాజెక్టు అసోసియేట్ బాలాజీ

మంగళం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ముఖ్యంగా తిరుమల అటవీప్రాంతాల్లో గజరాజులు ఎలా వస్తున్నాయి? ఎక్కడికి వెళుతున్నాయి? అనే దానిపై అధ్యయనం చేయడానికి వచ్చామని వైల్డ్‌లైఫ్ ఇండియా అసోసియేట్ బాలాజీ చెప్పారు. బుధవారం డెహ్రాడూన్ నుంచి ఆరుగురు సభ్యులతో కూడిన బృందం, తిరుపతికి చెందిన ఒక బయాలజిస్టు, ఐదుగురు ప్రొటెక్షన్ వాచర్లు తిరుమల కొండల్లో పర్యటించారు. తిరుమల కొండల్లో నుంచి భాకారపేట, మామండూరు, పరిసర ప్రాంతాల్లోకి ఏనుగులు రాకపోకలు సాగిస్తున్నట్లు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో ఉన్న ఏనుగులు.. వీటిలో ఆడ, మగ ఎన్ని? ఎక్కువ కాలం ఏ ప్రాంతంలో ఉంటున్నాయనే అంశాలను అధ్యయనం చేస్తామన్నారు. వీటికి ఆహారం, నీరు లభించే ప్రాంతాలను కూడా పరిశీలిస్తామన్నారు. ఏనుగుల పాదముద్రలు, వాటి విసర్జకాలను కూడాపరిశీలిస్తామని చెప్పారు. ఏనుగుల ట్రాకింగ్‌పై పూర్తి అవగాహన వచ్చాక అటవీప్రాంతాల నుంచి జనంలోకి, పంట పొలాల్లోకి రాకుండా ఎలా నియంత్రించాలనే దానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు.

నాలుగు లేబర్‌కోడ్, అగ్రి నల్లచట్టాలు రద్దు చేయాలి

● వామపక్షాలు, రైతు కార్మిక సంఘాల డిమాండ్ ● కలెక్టరేట్ వద్ద కార్మిక సంఘాల ఆందోళన



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్, మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని వామపక్షాలకు చెందిన కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. కలెక్టరేట్ వద్ద బుధవారం ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, రైతు సంఘాలు ఆందోళన నిర్వహించాయి. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, సీపీఐ ఎంఎల్ నగర కార్యదర్శి వెంకటరత్నం మాట్లాడుతూ ఎప్పుడో పార్లమెంట్‌లో ఆమోదించిననాలుగు లేబర్ కోడ్‌ను అమలు బిహార్ ఎన్నికల తర్వాత అమల్లోకి వస్తాయని ఆర్డినెన్సు విడుదల చేయడం దుర్మార్గమన్నారు. వ్యవసాయ నల్లచట్టాల రద్దుకోసం ఉద్యమించిన రైతాంగానికి క్షమాపణ చెప్పి ఉపసంహరించుకుంటామన్న ప్రధాని మోదీ.. ఇప్పుడా మాట విస్మరించారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోనూ పదిగంటలకుపైగా పనిచేయించుకోవచ్చని అసెంబ్లీలో తీర్మానం చేయడం దుర్మార్గమని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, జయచంద్ర పేర్కొన్నారు. ఈ ఆందోళనలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హేమలత, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచులయ్య, వివిధ కార్మిక సంఘాల నేతలు విజయకుమార్, రాజా, రవి, వేణుగోపాల్, రాధాకృష్ణ, సాయిలక్ష్మి, గంగ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతలో పాడిపరిశ్రమది కీలక భూమిక

● జాతీయ పాలదినోత్సవంలో వెటర్నరీ వీసీ జేవీ రమణ



తిరుపతిరూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతలో పాడిపరిశ్రమరంగం కీలక భూమిక పోషిస్తోందని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ జేవీరమణ పేర్కొన్నారు. శ్వేతవిప్లవ పితామహుడు డాక్టర్ వర్గీస్ కురియన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఇండియన్ డెయిరీ అసోసియేషన్ ఏపి లోకల్ చాప్టర్, డెయిరీ టెక్నాలజీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాతీయ పాలదినోత్సవంలో ఆయన మాట్లాడారు. దేశంలో పాడి పరిశ్రమ అభివృద్ధి, మహిళాసాధికారితలో కురియన్ సేవలు మరువలేనివన్నారు. చిత్తూరుజిల్లా కుప్పం మండలం, గరిగచ్చినేపల్లెకి చెందిన చంద్రశేఖర్ నాగజ్యోతిని ఐడీఏ-ఏపీలోకల్ చాప్టర్ ద్వారా ఉత్తమ మహిళా పాడిరైతుగా ఎంపిక చేసి రూ.10వేల నగదు, సర్టిఫికెట్‌తో సన్మానించారు. అలాగే నగరంలోని అగ్రికల్చర్, వెటర్నరీ, డెయిరీ టెక్నాలజీ, ఎస్వీఆర్ట్స్ కళాశాల, పద్మావతి మహిళా వర్సిటీ విద్యార్థులకు పాల ఉత్పత్తిదారులకు మెరుగైన రాబడిని నిర్ధారించడం అనేఅంశంపై వక్తృత్వపోటీలు నిర్వహించారు. తొలిమూడుస్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఐడీఏ-ఏపీలోకల్ చాప్టర్ ఛైర్మన్ డాక్టర్ రవి కుమార్, డెయిరీటెక్నాలజీ డీన్, లోకల్ చాప్టర్ కార్యదర్శి డాక్టర్ కె.నాగేశ్వరరావు, అసోసియేట్ డీన్ డాక్టర్ జి.గంగరాజు, డాక్టర్ మంజునాథ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలను పాటించని వాహనదారులకు రూ.3.17 లక్షల జరిమానా

తిరుమల, నవంబరు26(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలను పాటించని వాహనదారులకు బుధవారం అధికారులు రూ.3.17 లక్షల జరిమాన విధించారు. తిరుపతి రవాణాశాఖ, ట్రాఫిక్ అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి తిరుమల మొదటి, రెండవ ఘాట్‌రోడ్లలో బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించిన వారితో పాటు డ్రైవింగ్ లైసెన్స్, సరైన వాహనాల పత్రాలు లేని వారికి 105 చలానాల ద్వారా రూ.3.17 లక్షల జరిమాన విధించారు. నిత్యం రద్దీతో కూడిన తిరుమల క్షేత్రానికి వచ్చేవెళ్లేవారందరు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని అధికారులు సూచించారు. ఈ దాడుల్లో ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్, రవాణశాఖ అధికారులు శ్రీనివాసులు, అధిక నాజ్, స్వర్ణలత, వెంకటరమణ, ఆంజనేయప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరులో తండ్రిపై కూతురు కిడ్నాప్ కేసు

పుత్తూరు అర్బన్, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): తనతో పాటు తన భర్తను కిడ్నాప్ చేయబోయాడని తండ్రిపై కూతురు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు తండ్రి చంద్రబాబుపె పోలీసులు కిడ్నాప్ యత్నం కేసు నమోదు చేశారు. కల్యాణపురానికి చెందిన చంద్రబాబు పశు వైద్యుడు. కుటుంబ సమేతంగా కార్వేటినగరంలోని చర్చికి వెళ్లి ప్రార్థనలు నిర్వహించే వారు. ఈ క్రమంలో పవిత్ర ఎస్ఆర్‌పురం మండలం పొదలపల్లికి చెందిన గిరిప్రసాద్‌ను రెండు నెలల క్రితం తల్లిదండ్రుల సమ్మతి లేకుండా వివాహం చేసుకుంది. ఈక్రమంలో తల్లికి బాగాలేదని పవిత్రను పిలిపించిన చంద్రబాబు.. గిరిప్రసాద్‌ను కార్వేటినగరంలో రోడ్డులోని ఎస్ఎస్ బేకరి వద్ద నెంబర్ ప్లేట్ లేని కారులో తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పెనుగులాట జరిగి, కారు నుంచి బయటపడిన పవిత్ర, గిరిప్రసాద్ పుత్తూరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జంతు మార్కెట్ యాప్ ఆవిష్కరణ



యాప్‌ను ప్రారంభిస్తున్న వీసీ నరసింగరావు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఇంజినీరింగ్ కాలేజీ కంప్యూటర్ సైన్స్ నాలుగో సంవత్సర విద్యార్థి ఎం.పూర్ణప్రసాద్ రూపొందించిన జంతు మార్కెట్ యాప్‌ను వీసీ నరసింగరావు, రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు బుధవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పూర్ణచంద్ రూపొందించిన యాప్ ద్వారా జంతువులు, పశుగ్రాసం, పాల ఉత్పత్తులు, కూరగాయలు, పండ్లు, పంట ఉత్పత్తుల కొనుగోలు అమ్మకం, రైతులు పశు వైద్యులను సంప్రదించడానికీ, టీకా రిమైండ్ చేయడానికీ, పశువుల ధర వంటి వివరాలు పొందుపర్చినట్లు చెప్పారు. ఈ యాప్ రూపొందించడంలో ప్రొఫెసర్ వివేకానంద రెడ్డి మార్గదర్శకత్వం వహించారు. సీడీసీ డీన్ చెంగ్రాయుడు, రీసెర్చ్ డీన్ నరసింహ, ప్రిన్సిపాళ్ళు శ్రీనివాసులు, సుధారాణి, వెంకటేశ్వర్లు, పద్మావతి పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో రాజ్యాంగ దినోత్సవం



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అధికారులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం 76వ భారతరరాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, రోజ్మాండ్‌తో పాటు సుధారాణి, శివశంకర్‌నాయక్, కలెక్టరేట్ ఏవో రమేష్ బాబు, తహసీల్దారు శిరీష తదితరులు పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీలో మనోళ్ల ప్రతిభ




రవాణా శాఖ మంత్రిగా చిత్తూరు విద్యార్థిని ప్రియదర్శిని- వీక్షిస్తున్న రొంపిచెర్ల విద్యార్థి నిఖిల్



మాక్ అసెంబ్లీలో పాల్గొన్న జిల్లా విద్యార్థులు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం శాసనసభ ఆవరణలో విద్యార్థులతో మాక్ అసెంబ్లీ ఏర్పాటు చేసింది.ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.చిత్తూరు జిల్లాకు చెందిన ఎనిమిదిమంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు.ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఒక్కో విద్యార్థి పాల్గొనగా, చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మాత్రం ఇద్దరు విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులంతా ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలుగా వ్యవహరించగా, చిత్తూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా వ్యవహరించిన టెన్త్ విద్యార్థిని ఎస్.ప్రియదర్శిని రవాణా శాఖ మంత్రిగా వ్యవహరించారు. ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, వాటి నివారణకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోందనే అంశంపై ప్రతిపక్ష నేతలు ప్రశ్నల వర్షం కురిపించారు. దీనికి సమాధానంగా 'అధ్యక్షా... ద్విచక్ర వాహనాలకు సంబంధించి ప్రమాదాల రికార్డులు ఉన్నాయి. ప్రమాదాల నివారణకు హెల్మెట్‌ధారణ, ట్రాఫిక్ పర్యవేక్షణ బలోపేతం, రోడ్డు భద్రతా చర్యలు, కాలేజీ విద్యార్థులకు రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం' అంటూ ప్రియదర్శిని సమాధాన మివ్వడంతో సభా ప్రాంగణం చప్పట్లతో మార్మోగిపోయింది.ఆమెకు చక్కటి శిక్షణ ఇచ్చిన డీఈవో వరలక్ష్మిని, పాఠశాల హెచ్‌ఎం హసన్‌బాషాను ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, ఇతర మంత్రులు అభినందించారు.అలాగే పుంగనూరు నియోజకవర్గం రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి నిఖిల్ ప్రతిపక్ష ఎమ్మెల్యేగా తన ప్రతిభను ప్రదర్శించినట్లు ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు.కుప్పం నియోజకవర్గానికి సంబంధించి గుడుపల్లె నుంచి బి.నేత్రావతి, నగరి నియోజకవర్గానికి సంబంధించి తడుకు నుంచి ఎస్.కే.విజయకుమార్, పుంగనూరు నియోజకవర్గానికి సంబంధించి రొంపిచెర్లనుంచి పి.నిఖిల్, జీడీ నెల్లూరు నియోజకవర్గానికి సంబంధించి కాలేపల్లె నుంచి టి.లిఖిత, చిత్తూరు నియోజకవర్గానికి సంబంధించి గాండ్లపల్లె నుంచి ఎ.గౌతమ్, పూతలపట్టు నియోజకవర్గానికి సంబంధించి అరగొండ నుంచి ఎస్.సింధు, పలమనేరు నియోజకవర్గానికి సంబంధించి కొలమాసనపల్లె నుంచి పి.విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తికి జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచల కిషోర్

ఐరాల(కాణిపాకం), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు కుటుంబ సమేతంగా బుధవారం కాణిపాక వరసిద్ధుడిని బుధవారం దర్శించుకున్నారు. ఆయన్ను ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఖోఖో పోటీల్లో సత్తా చాటిన బాలికలు



సిల్వర్ ట్రోఫీతో జిల్లా ఖోఖో బాలికల జట్టు

బంగారుపాళ్యం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్-17 స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీల్లో చిత్తూరు జిల్లా బాలికల జట్టు సత్తా చాటింది. ఈ నెల 23, 24, 25వ తేదీల్లో విజయనగరం జిల్లాలో జరిగిన అండర్-17 రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో చిత్తూరు జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా బాలికల జట్టును కోచ్‌లు రాజేష్, మధు, దేవేంద్రలను టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్వీ ధరణీప్రసాద్, గౌరవాధ్యక్షుడు ఎన్వీ జయప్రకాష్, డీఎస్‌డీవో బాలాజీ, స్కూల్ గేమ్స్ కార్యదర్శి బాబు, శారద, పీడీలు ముత్తు, సురేష్ అభినందించారు.

టిప్పర్ ఢీకొని బ్యాంకు ఉద్యోగి మృతి



గోపీనాథ్ (ఫైల్ ఫొటో)

గంగవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కారును టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో ఓ బ్యాంకు ఉద్యోగి మృతిచెందిన సంఘటన బుధవారం గంగవరం మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గంగవరం సాయినగర్‌లో కాపురముంటున్న గోపీనాథ్ పలమనేరు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో డిప్యూటీ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం శంకరాయలపేట గ్రామంలో బంధువుల ఇంట్లో అయ్యప్ప స్వామి పూజకు కుటుంబసభ్యులతో హాజరయ్యారు. పూజ అనంతరం కుటుంబసభ్యులను అక్కడే ఉంచి కారులో విధుల కోసం పలమనేరుకు వస్తుండగా బాలేపల్లె క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. ప్రమాదంలో గోపీనాథ్ తీవ్రంగా గాయపడటంతో స్థానికులు పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రమాణ స్వీకారం



కుప్పం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ డైరెక్టర్‌గా మల్లానూరు ప్రేమ్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. రాజధాని అమరావతిలోని మంగళ గిరి ఏపీఐఐసీ టవర్స్ సమావేశపు హాలులో బుధవారం ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ఏపీఐఐసీ డైరెక్టర్‌గా పదవి లభించడానికి కారణమైన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి తనవంతు బాధ్యతగా కృషి చేస్తానని ప్రమాణం చేశారు. మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, దగ్గుబాటి ప్రసాద్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం నుంచి రాజశేఖర్, సురేశ్, బాబు, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బాబు, గుడుపల్లె మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ఏవీ.రవి, బి.వెంకటేశ్, బేటప్పనాయుడు, విజయ్, పార్థసారథి, నాగేంద్ర, రామకృష్ణ, అన్నాదురై, సంతానం, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీతో అంటకాగేవారు టీడీపీ నుంచి వెళ్లిపోండి: శాప్‌చైర్మన్



టీడీపీ పదవులకు దరఖాస్తు చేస్తున్న నాయకులతో రవినాయుడు

పుంగనూరు, నవంబరు26(ఆంధ్రజ్యోతి): ప్రజలతో పాటు శ్రేణులను అనేక ఇబ్బందులు పెట్టిన వైసీపీతో అంటకాగే టీడీపీ నాయకులు వెంటనే పార్టీనుంచి వెళ్లిపోవాలని పుంగనూరు టీడీపీ పరిశీలకుడు, శాప్ చైర్మన్ రవినాయుడు హెచ్చరించారు. పుంగనూరు పంచాయతీ రాజ్ గెస్ట్‌హౌస్, ఈడిగపల్లె భీమనేని రెస్టారెంట్‌లో బుధవారం టీడీపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా మండల, పట్టణ టీడీపీ అధ్యక్ష ఎన్నికలపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రబాబు, లోకేశ్ పుంగనూరుపై ప్రత్యేక దృష్టిపెట్టి నిర్మాణాత్మకంగా కమిటీలు వేయాలని ఆదేశించారని తెలిపారు. అన్ని చోట్లా ఏకాభిప్రాయంతోనే కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పిన ఆయన పోటీ ఉన్న చోట్ల ఐవీఆర్ఎస్ నిర్ణయిస్తుందన్నారు. పార్టీ పరిశీలకులు అమరనాథరెడ్డి, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతాపరాజు, తిరుపతి గంగమ్మగుడి చైర్మన్ మహేశ్‌యాదవ్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ అన్ని స్థానాలు కైవసం చేసుకునేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. పెద్దిరెడ్డితో పాటు ఆయన అనుచరులు మనలో మనకే గొడవలు సృష్టించి టీడీపీకి నష్టం చేయాలని ప్రయత్నిస్తారని, ఆ ఉచ్చులో ఎవరూ పడకూడదన్నారు. రూరల్ కమిటీ అధ్యక్ష స్థానానికి మాధవరెడ్డి నామినేషన్ వేసే సమయంలో ఈలలు, కేకలు వేసిన పార్టీ శ్రేణులను నాయకులు మందలించారు. పోస్టులకు అందజేసిన పేర్లను పార్టీ అధిష్ఠానానికి పంపుతామని, తర్వాత వారు ప్రకటిస్తారన్నారు. పుంగనూరులో టీడీపీ నాయకులు సీవీరెడ్డి, శ్రీకాంత్, రామకృష్ణమరాజు, దినేశ్, పోలీసుగిరి తదితరులు 29 వార్డు కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల సంతకాలతో టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఎవరిని ప్రతిపాదిస్తే వారికే పట్టణ అధ్యక్ష పదవి ఇవ్వాలని లేఖ అందజేశారు. పుంగనూరు, చౌడేపల్లె, గంగవరం సీఐలు, ఎస్‌ఐలు, బందోబస్తు నిర్వహించారు.మార్కెట్‌కమిటీ చైర్మన్ ఎన్.శమిపతి యాదవ్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణానాయక్, నాయకులు సుకుమార్‌బాబు, రమణ, గంగాధర్, దేశాది ప్రకాశ్, రాఘవ, చంద్ర, రామయ్య, విజయమ్మ, జీవనజ్యోతి, షామీర్, సద్దాంహుసేన్, గాజుల రమణ, మధుసూదన్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

అందమైన చిత్తూరు కోసం అందరూ సహకరించాలి



రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

చిత్తూరు అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రోడ్లు బాగుంటేనే నగరం అభివృద్ధి చెందుతుందని, అద్భుత, అందమైన చిత్తూరు కోసం ప్రతి ఒక్కరూ ముందుకురావాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పిలుపునిచ్చారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి, మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలతతో కలిసి నగరంలోని కొంగారెడ్డి, పలమనేరురోడ్డు విస్తరణ పనులకు భూమి పూజ చేశారు. ఉదయం కొంగారెడ్డిపల్లె రోడ్డుకు డీసీసీబీ కార్యాలయం వద్ద భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు విస్తరణ కోసం డీసీసీబీ స్థలాన్ని ఇవ్వడమే కాకుండా ప్రహరీని లోపలివైపు సొంత నిధులతోనే నిర్మించుకుంటామని హామీ ఇవ్వడంపై చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. మధ్యాహ్నం పలమనేరు రోడ్డుకు పశువైద్య కళాశాల వద్ద, పోలీసు స్టేషన్ ఆవరణం, కన్నన్ కళాశాల ఆవరణం వద్ద కలెక్టర్‌తో కలిసి భూమి పూజ చేశారు. దర్గా సర్కిల్ నుంచి ఇరువారం వరకు మాస్టర్‌ప్లాన్ ప్రకారం వంద అడుగులు విస్తరించి అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. రెండవ పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణంలో రోడ్డు విస్తరణకు అవసరమైన స్థలాన్ని గుర్తించారు. ప్రభుత్వ స్థలాన్ని రోడ్డుకు అవసరమైన స్థలాన్ని తీసుకుని ప్రహరీని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నరసింహ ప్రసాద్, ఏసీపీ నాగేంద్ర, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, కూటమి నేతలు పాల్గొన్నారు.

రోగులకు వరం డిజిటల్ నర్స్ సెంటర్



ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ ఇస్తున్న డీఎంహెచ్‌వో సుధారాణి

చిత్తూరు రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సంజీవిని డిజిటల్ నర్స్ సెంటర్ పేదలకు వరంలాంటిదని డీఎంహెచ్‌వో సుధారాణి అన్నారు. బుధవారం నగర శివారు ప్రాంతమైన సీతమ్స్ కళాశాలలో త్వరలో ప్రారంభించనున్న డిజిటల్ నర్స్ సెంటర్ నిర్వహణపై ఎంఎల్‌హెచ్‌పీలకు ప్రాక్టికల్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుప్పంలో ఏర్పాటు చేసిన నర్స్ సెంటర్ మాదిరిగా చిత్తూరులో కూడా ఏర్పాటు చేయనున్నారన్నారు. ఈ కేంద్రం చిత్తూరు నలుమూలల నుంచి అత్యవసర సేవలకు, ఇతర వ్యాధులకు ఏ మందులు వాడాలి, ఎక్కడ చికిత్స అందిస్తారనే విలువైన సమాచారాన్ని ఫోన్ ద్వారా ఉచితంగా సేవలు పొందవచ్చునన్నారు. 24 గంటలు ఈ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఎప్పుడు ఎవరు సంప్రదించినా అందుకు తగ్గ వైద్య సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరితో మర్యాదగా నడుచుకోవాలని, అత్యవసర సమయాల్లో కచ్చితమైన సూచనలు చేయాలని తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీలకు టాటా కన్సల్టెన్సీ ప్రతినిధి హరీష్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఐవో హనుమంతరావు పాల్గొన్నారు.

దివ్యాంగుల క్రీడాపోటీలకు మంచి స్పందన




బ్యాడ్మింటన్‌లో పోటీ పడుతున్న దివ్యాంగులు- విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అధికారులు

చిత్తూరు క్రీడలు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 3న అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మెసానికల్ మైదానంలో నిర్వహించిన దివ్యాంగుల క్రీడాపోటీలకు మంచి స్పందన లభించిందని డీఎస్‌డీవో బాలాజీ తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. అథ్లెటిక్స్, చెస్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించగా, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో గెలుపొందిన వారికి అధికారులు బహుమతులు ప్రదానం చేశారు. కోచ్‌లు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న కంటైనర్

- డ్రైవర్‌కు గాయాలు.. ట్రాఫిక్‌కు అంతరాయం




నుజ్జునుజ్జయిన కంటైనర్ క్యాబిన్, డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

బంగారుపాళ్యం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగుళూరు జాతీయ రహదారి మొగిలి ఘాట్‌లోని దొరచెరువు సమీపంలో లారీని కంటైనర్ ఢీ కొనడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. బంగారుపాళ్యం సీఐ శ్రీనివాసులు కథనం మేరకు... బుధవారం ఉదయం పలమనేరు నుంచి చిత్తూరు వెళుతున్న కంటైనర్ ముందు వెళుతున్న లారీని వెనుకవైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కంటైనర్ డ్రైవర్ కృపాల్ క్యాబిన్‌లో ఇరుక్కుపోగా, పోలీసులు, స్థానికులు గంట సేపు శ్రమించి వెలికి తీశారు. గాయపడ్డ కృపాల్‌ను 108 ద్వారా బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్సల కోసం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. సంఘటనా స్థలంలో గంటకుపైగా వాహనాలు రోడ్డుపై నిలిచిపోవడంతో సీఐ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

విద్యుత్‌షాక్‌తో వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మృతి

- సీఎం చంద్రబాబు సంతాపం



భూపతి (ఫైల్ ఫొటో)

రామకుప్పం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం వీర్నమలకు చెందిన రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టరు భూపతి(36) విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. భూపతి షామియానా, సౌండ్‌సిస్టమ్, విద్యుద్దీపాలంకరణ సప్లయర్స్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భూపతి టీడీపీ ప్రతిపక్షంలో ఉండగా వీర్నమల పంచాయతీ అధ్యక్షుడిగా పార్టీ పటిష్ఠతకు కృషి చేశారు. ఆయన కృషిని గుర్తించిన పార్టీ అధిష్ఠానవర్గం ప్రభుత్వం రాగానే ఆయన్ను వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టరుగా నియమించింది. బుధవారం ఆయన రామకుప్పం మండల సరిహద్దుల్లోని కుప్పం మండలం దేవరాజుపురం సమీపంలో ఓ ఇంటి గృహప్రవేశానికి విద్యుద్దీకరణ పనులు చేపట్టాడు. ఈ క్రమంలో భవనం రెండో అంతస్తు నుంచి సీరియల్‌సెట్లను కిందకు వేలాడదీస్తుండగా అవి కింద ఉన్న విద్యుత్‌స్తంభం తీగలపై పడింది. దీంతో విద్యుదాఘాతానికి గురికావడంతో కుప్పం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. కుప్పం పోలీసులు కేసు నమోదు చేశారు. భూపతి మృతి పట్ల సీఎం చంద్రబాబు ఒక ప్రకటనలో విచారం, సంతాపం వ్యక్తం చేశారు. టీడీపీ వీరాభిమాని అయిన భూపతి విద్యుత్‌షాక్‌తో మృతి చెందడం బాధాకరమని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. భూపతి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నాయకులు సంతాపం తెలిపారు.

పంటలపై ఆగని గజ దాడులు

- వరి, మామిడి, రాగి, ఉలవ పంటల ధ్వంసం



ఒంటరి ఏనుగు దాడిలో ధ్వంసమైన వరిపంట

కల్లూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఒంటరి ఏనుగు దాడులు ఆగడంలేదు. మండలంలోని దేవళంపేట పంచాయతీలో మంగళవారం రాత్రి ఒంటరి ఏనుగు దాడిలో మామిడి, వరి, రాగి, ఉలవపంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని సూరప్పచెరువు నుంచి బయలుదేరిన ఒంటరి ఏనుగు దేవళంపేట పంచాయతీ దిగువమూర్తివారిపల్లి వద్దకు చేరుకుంది. నాగరాజుకు చెందిన రాగి, ఉలవ పంటను ధ్వంసం చేసిన ఒంటరి ఏనుగు మామిడిచెట్ల కొమ్మలను విరిచేసింది. రైతులు చెంగల్రాయులు, గురుస్వామి, బాలచంద్ర, శంకరకు చెందిన మామిడి చెట్లను ధ్వంసం చేసిన ఒంటరి ఏనుగు కల్లూరు-కమ్మపల్లి రోడ్డును దాటుకుంది. దేవళంపేటలోని రైతు సుదాకర్‌కు చెందిన వరి, మామిడి, జొన్నపంటను ధ్వంసం చేసిన ఒంటరి ఏనుగు రైతు శివరాంకు చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేసింది. అక్కడి నుంచి వచ్చిన మార్గంలోని రైతుల మామిడిచెట్ల కొమ్మలను విరుచుకుంటూ ఒంటరి ఏనుగు అడవిలోకి చేరుకుంది. బుధవారం పగలంతా అడవిలోని చింతలవంక వద్ద ఒంటరి ఏనుగు సంచరించినట్లు ప్రజలు తెలిపారు.

కొత్త లేబర్ కోడ్‌లను రద్దుచేయాలి

- ఏఐటీయూసీ, సీఐటీయూ డిమాండ్



గిరింపేటలో కార్మిక సంఘాల నిరసన


చిత్తూరు రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్థానిక గిరింపేటలో నిరసన కార్యక్రమం చేపట్టారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌ల అమలు కోసం కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేయడం దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే కార్మిక యూనియన్లు సమ్మె చేసే హక్కు, వేతనాల కోసం యాజమాన్యంతో చర్చించే హక్కులు లేకుండా పోతాయన్నారు. కార్మికులు తీవ్రంగా నష్టపోతారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నేత నాగరాజు, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు దాస్, ఆనంద్, విజయగౌరి, జమిలాబీ తదితరులు పాల్గొన్నారు.

ఇరుముడికి వచ్చి మృత్యుఒడికి ....

- కుశస్థలీ నదిలో నీట మునిగి యువకుడి మృతి



విజయకుమార్ మృతదేహం



వెదురుకుప్పం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఇరుముడి పూజకు వచ్చిన యువకుడు కుశస్థలీ నదిలో మునిగి మృత్యుఒడికి చేరుకున్న ఘటన కార్వేటినగరం మండల పరిధిలో జరిగింది. స్థానికుల కథనం మేరకు... ఎస్ఆర్‌పురం మండలం చొక్కమడుగుకు చెందిన భానుమతికి గంగాధరనెల్లూరు మండలం మహదేవమంగళంకు చెందిన మురుగేష్‌లు భార్యాభర్తలు. వీరు ఉపాధి నిమిత్తం బెంగుళూరులో స్థిరపడగా, మురుగేష్ ఏడాది క్రితం మరణించారు. వీరికి విజయకుమార్(24) అనే కుమారుడు ఉన్నాడు. ఈ క్రమంలో చొక్కమడుగులో తన మేనమామ ఆర్ముగం నాలుగు రోజుల క్రితం నిర్వహించిన అయ్యప్పస్వామి ఇరుముడి కార్యక్రమానికి విజయకుమార్ వచ్చాడు. బుధవారం ఆ గ్రామానికి పక్కనే ఉన్న కుశస్థలీ నదిలో కార్వేటినగరం మండలం బట్టువారిపల్లి పరిధిలోకి వెళ్లారు. నదిలో లోతైన ప్రాంతంలో దిగడంతో ఈతరాని కారణంగా నీటమునిగి విజయకుమార్ మృత్యుఒడికి చేరుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న బంధువులు కార్వేటినగరం పోలీసులకు, పుత్తూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు బుధవారం మృతదేహాన్ని వెలుపలికి తీశారు. శవపరీక్ష నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కార్వేటినగరం ట్రైనీ ఎస్ఐ రమేష్ తెలిపారు.

పులి సంచారంపై ప్రజలకు అవగాహన



కమ్మగుట్టపల్లి అడవిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రాకేష్ కుమార్

పూతలపట్టు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కమ్మగుట్టపల్లిలో పులిసంచారంపై ప్రజలకు ఫారెస్టు అధికారులు అవగాహన కల్పించారు. కమ్మగుట్టపల్లి సమీపాన కమ్మగుట్ట అడవి ప్రాంతంలో పులి సంచరిస్తోందని ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఐరాల డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రాకేష్‌కుమార్, బీట్ ఆఫీసర్ లావణ్య బుధవారం కమ్మగుట్ట అటవీ ప్రాంతానికి వచ్చి పశువుల కాపర్లు, ప్రజలు ఒంటరిగా అటవీ ప్రాంతానికి వెళ్లరాదని సూచించారు.

ఘనంగా సుబ్రహ్మణ్యషష్ఠి పూజలు



నాగదేవతలకు పూజలు చేస్తున్న భక్తులు

రామకుప్పం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో బుధవారం సుబ్రహ్మణ్యషష్ఠి పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం స్వామివారికి, నాగుల ముద్దమ్మలకు ప్రత్యేక జలాభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకొని అర్చనలు చేయించారు. అలాగే ఆలయ ఈశాన్య దిక్కున ఉన్న నాగులపుట్టకు పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

అన్న క్యాంటీన్‌లో అన్నదానం



రామకుప్పం అన్న క్యాంటీన్‌లో అన్నదానం చేస్తున్న ఆనందరెడ్డి

రామకుప్పం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రామకుప్పం మండల మాజీ అధ్యక్షుడు ఆనందరెడ్డి తన జన్మదినం సందర్భంగా నేతలతో కలిసి బుధవారం రామకుప్పంలోని అన్న క్యాంటీన్‌లో అన్నదానం చేశారు. ఉదయం స్థానిక అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో ఆయన అభిమానులు చేయించిన ప్రత్యేక అభిషేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బందార్లపల్లె పంచాయతీ టీడీపీ శ్రేణులు రామకుప్పం ఆదర్శపాఠశాల విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దుచేయాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు

పలమనేరు, నవంబరు 26 : కేంద్రం ఇటీవల తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్లను తక్షణమే రద్దుచేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు గిరిధరగుప్తా డిమాండు చేశారు. బుధవారం 11 జాతీయ కార్మిక సంఘాలు, వామపక్షాల పిలుపు మేరకు పలమనేరు సిల్కుఫారం వద్ద సిఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిధర గుప్తా మాట్లాడుతూ కార్మికులకు తీపి కబురు అంటూ కేంద్రప్రభుత్వం ఈనెల 22వ తేదీ నుంచి అమల్లోకి తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్లలో అన్ని శ్రామికులకు వ్యతిరేకంగా ఉందని పేర్కొన్నారు. ఎనిమిది గంటల పనివిధానాన్ని 12 గంటలకు పెంచడం ఎవరికి లాభం అని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రమేష్, సీపీఎం పట్టణ కార్యదర్శి రాజా, మహిళా సంఘ కార్యదర్శి జయంతి, శాంతమ్మ, ప్రజానాటక మండలి కార్యదర్శి ప్రతాప్, బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు అంజి, హైదర్, ఖైరున్నీసా, రాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

● పలమనేరు అంబేడ్కర్ సర్కిల్ వద్ద బుధవారం ఎస్‌ఎం కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేయాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షురాలు వీఆర్ జ్యోతి, రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.

చల్లా రామచంద్రారెడ్డికి సత్కారం

రొంపిచెర్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని బుధవారం ఆయన స్వగృహంలో రొంపిచెర్ల గ్రామకమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ రమణ, తెలుగు యువత అధ్యక్షుడు వినోద్, ప్రధాన కార్యదర్శి నూకల నాగార్జున, ఐ-టీడీపీ పి.నౌషాద్, ఎస్సీసెల్ ముద్దుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంటలకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తాం



మార్కెట్ కమిటీ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్, సభ్యులు

రొంపిచెర్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతులకు మామిడి, టమోటా వంటి పంటలకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తామని మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ కె.సుజాత అన్నారు. బుధవారం రొంపిచెర్ల మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్, రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలకు చెందిన సభ్యులచే మార్కెట్ కమిటీ కార్యదర్శి బాలాజీ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎం.త్యాగరాజు, సభ్యులు కవిత, గిరి, చంగల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఈశ్వరయ్య, విజయమ్మ, భూదేవి, లక్ష్మీనారాయణమ్మ, బి.సుబ్రహ్మణ్యం, వెంకట్రమణనాయుడు, జి.కవిత, రెడ్డిశివ, సుబ్బరాజు, నిర్మల, రొంపిచెర్ల సింగిల్‌విండో చైర్మన్ రఘునాథరెడ్డి, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టరు ఉయ్యాల రమణ, జిల్లా బీజేపీ అధ్యక్షుడు జగదీశ్‌నాయుడు, నియోజకవర్గ జనసేన అధ్యక్షుడు సోమశేఖర్, బీజేపీ జిల్లా కార్యదర్శి లోకేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలి



సోమల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి సూరిబాబు పేర్కొన్నారు. బుధవారం సోమల మండలంలోని పలు సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. రైతు సేవా కేంద్రాల్లో ఈకేవైసీ, యూరియా పంపిణీ రికార్డులను పరిశీలించారు. డంపింగ్ యార్డులను పరిశీలించి వర్మీకంపోస్టు తయారీపై కార్యదర్శులతో సమీక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో లక్ష్మీదేవి, ఏఈలు మణికంఠ, అనూష, ఆనంద్, కార్యదర్శులు విశ్వమాలిని, జయశంకర్, దివ్యభారతి, మణికుమార్, హరీశ్, మేనక తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు

కుప్పం/పుంగనూరు

సుజ్ఞానానంద ఆశ్రమంలో 1న భగవద్గీత జయంతి

కుప్పం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కుప్పం టీబీ రోడ్డులోని సుజ్ఞానానంద ఆశ్రమంలో డిసెంబరు 1వ తేదీన శ్రీమద్భగవద్గీత జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆశ్రమాధిపతి ప్రజ్ఞానానంద సరస్వతి, మేనేజరు వీవీ రాజులు తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆశ్రమంలో శ్రీమద్భగవద్గీత కంఠస్థ పోటీలను నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన పెద్దలు, పిల్లలు తమ పేర్లను ఈనెల 27వ తేదీలోగా ఉచితంగా నమోదు చేసుకోవచ్చన్నారు. కనవల్లి 9963986620, శివభూషణమ్మ 9000116740, సత్యవాణి 9676124756 నంబర్లను సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే సుజ్ఞానానంద ఆశ్రమంలో 1వ తేదీన ఉదయం 6.30 నుంచి 7 గంటల వరకు శ్రీమద్భగవద్గీత పారాయణం, 7 నుంచి 8.15 గంటల వరకు శంకరాచార్యులు రచించిన ప్రకరణ గ్రంథాలపై విచారణ, సాయంత్రం 5.30 నుంచి 6 గంటల వరకు పారాయణం, 6 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు శంకరాచార్యులు రచించిన ప్రకరణ గ్రంథాలపై విచారణ అంశాలపై ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సాధకులందరూ పారాయణ, విచారణలో పాల్గొని శ్రీమద్భగవద్గీతాచార్యుని కృపను పొందాలని కోరారు.

కార్మికుల హక్కులు హరించే చట్టాలు రద్దు చేయాలి

పుంగనూరు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్‌కోడ్ నల్లచట్టాలతో కార్మికుల హక్కులు హరిస్తాయని వాటిని వెంటనే రద్దు చేయాలని పుంగనూరులో ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసనగా ర్యాలీ చేసి వెంటనే కేంద్రప్రభుత్వం లేబర్‌కోడ్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సైఫుల్లా, శ్రీనివాస్, గిరిశేఖర్, మురళి, హిదాయతుల్లా, భానుప్రకాశ్, కార్తీక్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

మూలన పడిన ఈ-ఆటోలు



మున్సిపల్ కార్యాలయం వద్ద ఏడాదిగా వృథాగా ఉన్న ఈ-ఆటోలు

పలమనేరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): డీజిల్ వ్యయాన్ని తగ్గించడంతో పాటు ఇరుకైన వీధుల్లో చెత్త తరలించేందుకు గత ప్రభుత్వం పలమనేరు మున్సిపాలిటీకి అందించిన ఎలక్ట్రిక్ ఈ-ఆటోలు మూలనపడ్డాయి. ఈ బ్యాటరీ ఆటోలు నిర్వహణ లోపంతో ఏడాదిగా పలమనేరు మున్సిపల్ కార్యాలయం వద్ద వాహనాల కోసం ఏర్పాటు చేసిన షెడ్‌లోనే ఉన్నాయి. దీంతో ఆటోల కోసం వెచ్చించిన లక్షల ప్రజాధనం నిరుపయోగమైనట్లు తెలుస్తోంది. అధికారులు వీటి వినియోగానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శక్తి యాప్‌తో సైబర్ నేరాలకు అడ్డుకట్ట

సోమల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శక్తి యాప్‌తో సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలని సోమల ఎస్‌ఐ శివశంకర తెలిపారు. బుధవారం కందూరు ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో శక్తి యాప్ పనిచేయు విధానం, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే వీడియో కాల్స్, లోన్ యాప్‌ల మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, బాల్యవివాహాలు, పోక్సో చట్టం పై పలు సూచనలు చేశారు. విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వాసు, షకీల్, రామాంజులు, దేవిక తదితర ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

30 మందికి కుట్టుమిషన్ల పంపిణీ

పుంగనూరు రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పుంగనూరు హట్టన్ మెమోరియల్ కమ్యూనిటీ హాల్‌లో కుట్టుశిక్షణ పొందిన 30 మంది మహిళలకు గురువారం రాయలసీమ బిషప్ వరప్రసాద్, ఆయన సతీమణి భారతి కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వతంత్రంగా జీవించడం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘ ప్రతినిధులు ఆనందబాబు, పాస్టర్ రాజేశ్ నిమోద్, షేర్లీ, రవికుమార్, భరత్ భూషణ్, కృపాకర్, సురేశ్‌క్రిష్టఫర్, ఉదయ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

బైరెడ్డిపల్లె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు మండలంలోని కడపనత్తం జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులు బాలుర విభాగంలో పరమేష్‌కుమార్, బాలికల విభాగంలో గాయత్రి, బిందుమేఘన ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం మాంచాల, పీడీ చిరంజీవి తెలిపారు. ఈనెల 21న తిరుపతిలో జరిగిన బేస్‌బాల్ ఎంపిక పోటీల్లో వీరు ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 27 నుంచి 29 వరకు అహోబిలంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

హాస్టల్ విద్యార్థినులకు అవగాహన

చిత్తూరు అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక విజయలక్ష్మికాలనీలోని బాలికల బీసీ హాస్టల్‌ను బుధవారం టూటౌన్ సీఐ నెట్టికంఠయ్య సందర్శించారు. విద్యార్థినులకు సైబర్ నేరాలు, పోక్సో చట్టం, మహిళలపై నేరాలు, మాదకద్రవ్యాల దుర్వినియోగం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చి భద్రతా చర్యలు, చట్టపరమైన పరిణామాలు, తమను తాము రక్షించుకోవడానికి విద్యార్థినులు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల గురించి అవగాహన కల్పించారు. అనంతరం వారికి పెన్నులు, పరీక్షా ప్యాడ్లను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడ్డ కార్యకర్తలకు అండగా ఉంటాం

● శాప్ చైర్మన్ రవినాయుడు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ రవినాయుడు

చౌడేపల్లె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కష్టపడ్డ ప్రతికార్యకర్తకు టీడీపీ అండగా ఉంటుందని శాప్ చైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. బుధవారం ఆయన ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. చౌడేపల్లె శ్రీనివాసా ఫంక్షన్ హాల్‌లో మండల పార్టీ సర్వసభ్య సమావేశం జరిగేలా రాష్ట్ర పార్టీ కార్యాలయం షెడ్యూల్ విడుదల చేసింది. అయితే అనివార్య కారణాలతో గువ్వల రమేష్‌రెడ్డి వర్గం బోయకొండలో సమావేశం ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకులు లక్ష్మణరాజు (పతిరాజు) వర్గం షెడ్యూల్ ప్రకారం కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. మొదట బోయకొండలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన అనంతరం చౌడేపల్లెలోని కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నవారికి, కేసుల్లో మగ్గిన వారికి, గత వైసీపీ ప్రభుత్వంలో బాధితులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని అవసరమైతే మరికొన్ని నామినేటెడ్ పదవులు ఇచ్చి కార్యకర్తలను గౌరవించుకుంటామన్నారు. మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్, టీడీపీ నాయకులు గువ్వల రమేష్‌రెడ్డి, లక్ష్మణరాజు, ప్రదీప్‌రాజు, సింగిల్‌విండో చైర్మన్ హరి ప్రసాద్, సీనియర్ నాయకులు పార్థసారధి, నాగభూషణాచారి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల పార్టీ అధ్యక్ష పదవికి 6 వినతులు



సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకులు నాగేశ్వర నాయుడు

చౌడేపల్లె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగత కమిటీ ఎన్నికల్లో భాగంగా టీడీపీ మండలాధ్యక్ష పదవికి 6 వినతులు వచ్చినట్లు అబ్బర్వర్ పాల ఏకిరి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కందూరి నాగేశ్వర్ నాయుడు పేర్కొన్నారు. బుధవారం ఆయన మండల కమిటీ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ అధ్యక్ష పదవి కోసం గత ఐదేళ్ల నుంచి పార్టీ అధ్యక్షుడిగా ఉన్న గువ్వల రమేష్‌రెడ్డి, లక్ష్మణరాజు, గంగాధర్‌రెడ్డి, నరేష్ బాబు, రామకృష్ణ, పార్థసారధిలు తో కలిపి 6 మంది, గంగరాజు ఉపాధ్యక్ష పదవి కోసం వినతి పత్రాలు సమర్పించారు. అర్జీలను పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపి ఐవీఆర్ఎస్ పద్ధతిలో మండల పార్టీ అధ్యక్షుడి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన టీడీపీ కార్యకర్తల పైనే అక్రమ కేసులు పెడుతున్నారా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. చౌడేపల్లె మండలంపై మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి పెట్టారని, ప్రతి సమస్యలను తన దృష్టికి నారా లోకేష్ పేరుతో వినతి అర్జీలు ఇస్తే అయనకు అందించనున్నట్లు తెలిపారు. మంత్రి స్వయం గా ఫోన్ చేసి మీ సమస్యలను పరిష్కరిస్తారని హామి ఇచ్చారు. కార్యక్రమంలో మాజి ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్, టీడీపీ నాయకులు రమేష్‌రెడ్డి, లక్ష్మణరాజు, ప్రదీప్‌రాజు, సింగిల్‌విండో చైర్మన్ హరి ప్రసాద్, సీనియర్ నాయకులు పార్థసారధి, నాగభూషణాచారి, నారాయణరెడ్డి పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



కుప్పం: కంగుందిలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న పీఎస్ఎం తదితరులు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దళిత సంఘ నాయకులు

పుంగనూరు రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాణ కమిటీ చైర్మన్ బి.ఆర్. అంబేడ్కర్‌కు దళిత సంఘ నాయకులు పుంగనూరులో పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, శ్రీనివాసులు, శేషాద్రి, రామకృష్ణ, నరసింహులు, రాజన్న, రెడ్డెప్ప, అయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పలు పాఠశాలలు, కళాశాలల్లో నివాళులర్పించారు

● **కల్లూరు**: భారత దేశానికి రాజ్యాంగం ఒక దిక్సూచి లాంటిదని కళాశాల ప్రిన్సిపాల్ తులసీరాం తెలిపారు. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి నందవనం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ పీవో సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **కుప్పం:** భారత రాజ్యాంగం సకల జనాశ్రయానికి హామీ పడిందని ఏపీఐఐసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పంలో పలుచోట్ల బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కుప్పం మండలం కంగుందిలో నిర్వహించిన కార్యక్రమంలో భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుప్పం డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల వైస్ చైర్మన్ సాగర్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

● **బైరెడ్డిపల్లె:** మండలంలోని పెద్దచెల్లారగుంట జడ్పీఉన్నత పాఠశాలలో బుధవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలు హెచ్‌ఎం రవికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గస్థాయిలో ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని పరిణీతను ఘనంగా సన్మానించారు. అలాగే తీర్థం జడ్పీఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం లక్ష్మీపతి ఆధ్వర్యంలో విద్యార్థులచే మాక్ అసెంబ్లీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్పీ షాబుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **రామకుప్పం:** భావితరాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని భారత రాజ్యాంగ రూపకల్పన జరిగిందని టీడీపీ రామకుప్పం మండలాధ్యక్షుడు వెంకటరమణ తెలిపారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం రామకుప్పంలో అంబేడ్కర్ విగ్రహానికి పూజలు చేసి, ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కామరాజనాయక్, మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి కడా పీఏసీ సభ్యుడు రఘు, క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి, తెలుగు యువత నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అవినాశ్‌రెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి గజేంద్ర, ఆత్మా మాజీ డైరెక్టరు రామలింగారెడ్డి తదితర నేతలు పాల్గొన్నారు.

● **పలమనేరు:** పలమనేరులో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని వైసీపీ నాయకులు , కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైసీపీ నాయకులు హేమంత్‌కుమార్‌రెడ్డి, ప్రహ్లద, చెంగారెడ్డి, సోమచంద్రారెడ్డి, శ్యాంసుందర్‌రాజ్, కమాల్, నాగరాజు, మురళీకృష్ణ, నరేష్, సుందరేశ్, హేమంత్‌కుమార్, హైదర్ తదితరులు పాల్గొన్నారు.

● **సోమల**: భారత రాజ్యాంగం వజ్రాయుధం లాంటిదని ఎన్ఎస్ఎస్ పీవో గౌతం అన్నారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

● **రొంపిచెర్ల:** రొంపిచెర్లలోని డాక్టరు బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద భారత రాజ్యాంగ దినోత్సవం వేడుకలు బుధవారం అసరా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎన్.ఓబులేసు, రమేష్, దొరస్వామి, రాజన్న రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

● **రామకుప్పం:** రామకుప్పం మండలం రాజుపేటలోని గ్రీన్‌వ్యాలీ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు జాతీయ పతాకాలతో రాజ్యంగ నిర్మాత అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

చంద్రబాబు రైతు పక్షపాతి



అడవిబూదుగూరు పొలాల్లో రైతులతో రాజగోపాల్ తదితరులు



పెద్దపంజాణి మండలం లింగాపురంలో రైతులకు కరపత్రాలు అందజేస్తున్న పశుసంవర్థక శాఖ ఏడీ సుజాత

కుప్పం రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు రైతు పక్షపాతి అని కుప్పం టీడీపీ మండలాధ్యక్షుడు రాజగోపాల్ అన్నారు. కుప్పం మండలంలోని మల్లానూరు, అడవిబూదుగూరు గ్రామాలలో రైతన్నా - మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సాంబశివం, కడా పీఏసీ సభ్యుడు రామచంద్ర, శరవణ, మణి, కనకరాజు, శ్రీనివాసులు, విభూషణ్, గాయత్రి, మోహన్, దాము, కృష్ణమూర్తి, రమేశ్, గణేశ్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

● **రామకుప్పం:** సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎంతో మేలు చేస్తోందని తెలుగు యువత రామకుప్పం మండల ప్రధాన కార్యదర్శి వెంకటాచలం తెలిపారు. బుధవారం మండల పరిధి ఆవులకుప్పంలో స్థానిక నేతలు, ఆర్ఎస్‌కే అధికారులతో కలిసి రైతన్నా-మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో నేతలు వెంకటేశ్, నాగరాజనాయుడు, భాస్కర్, బాలాజీ పాల్గొన్నారు.

● **సోమల:** సోమల మండలం ఇరికిపెంట పంచాయతీలో బుధవారం రైతన్నా మీకోసం వారోత్సవాల కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, కార్యదర్శి మేనక , నీటి సంఘ అధ్యక్షుడు గల్లా బోస్, చంద్రశేఖర్‌నాయుడు, రెడ్డెప్పనాయుడు, రఘుపతి నాయుడు, శ్రీకాంత్, గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

● **బైరెడ్డిపల్లె:** రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని కమ్మనపల్లె పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి అన్నారు. మండలంలోని జాలారిపల్లె గ్రామంలో బుధవారం జరిగిన రైతన్నా - మీకోసం, ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రైతుల సంక్షేమానికై ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి చంద్రారెడ్డి, నాయకులు ఓబులేసు, శివకుమార్, మునాఫ్, రవి తదితరులు పాల్గొన్నారు.

● **పలమనేరు** : రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను రైతులకు అందజేస్తోందనిరైతులు ఈపథకాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీ సుజాత కోరారు. బుధవారం పెద్దపంజాణి మండలం లింగాపురంలో రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వం నుంచి వచ్చిన కరపత్రాలను రైతులకు పంపిణీ చేశారు. అనంతరం ఏడీ సుజాత ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలాజీ, తహసీల్దార్ హనుమంత్‌నాయక్, మండల పశువైద్యాధికారిణి వినిత, లింగాపురం గ్రామ సర్పంచ్ రుద్రమూర్తి, కార్యదర్శి సుకుమార్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరగాలి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఆధ్యాత్మిక, సామాజిక, సాంస్కృతిక నైపుణ్యాలను పెంచాలని నారాయణ విద్యాసంస్థల డీజీఎం కొండలరావు అన్నారు. బుధవారం జిల్లాలోని నారాయణ విద్యాసంస్థలకు సంబంధించి చిత్తూరు కొంగారెడ్డిపల్లిలోని బ్రాంచ్‌లో మాస్టర్ ఓరేటర్ కాంటెస్టు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీఎంలు మాట్లాడుతూ 1-5 తరగతుల విద్యార్థుల్లోని ప్రతిభ, నైపుణ్యాలు వెలికితీయడంతో పాటు సామాజిక బాధ్యత పెంచాలని సూచించారు. అనంతరం విద్యార్థులచే భాషా నైపుణ్యం, వాదనా నైపుణ్యం, శరీర భాష, ప్రసంగాల శైలి ఆధారంగా పోటీలు నిర్వహించి మూల్యాంకనం చేశారు. ప్రతిభ కనపరచిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏజీఎం పణికుమార్, ఆర్ఐలు, కోఆర్డినేటర్లు, బ్రాంచ్ ప్రిన్సిపాల్స్ ట్రైనర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఎంటీసీలో పాల్గొన్న ప్రముఖులు

మహిళా సాధికారతే చంద్రబాబు లక్ష్యం



గ్యాస్‌స్టౌవ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

నగరి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా సాధికారత సాధించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పని చేస్తున్నారని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. నగరి మున్సిపల్ పరిధిలో నాగలాపురం రోడ్డులోని హెచ్‌పీ ఉజ్వల గ్యాస్ కార్యాలయ ఆవరణలో బుధవారం జరిగిన గ్యాస్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో ప్రభుత్వం తరఫున అభివృద్ధి పనులు పూర్తిచేసినట్లు తెలిపారు. మహిళల కోసం గ్యాస్ కనెక్షన్, స్టౌవ్, అవసరమైన సామగ్రిని ప్రభుత్వం తరఫున ఉచితంగా అందచేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో అనుపమ, తహసీల్దార్ రవికుమార్, కమిషనర్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో వాణి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు బాలాజీ, నాయకులు కృష్ణారెడ్డి, సురేష్‌నాయుడు, నారాయణస్వామి నాయుడు, అశోక్, సలీం, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బైక్‌పై వెళ్లి సప్లై ఛానల్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే



కాజూరు చెరువుకు నీళ్లు తిప్పడానికి వెళుతున్న ఎమ్మెల్యే జగన్మోహన్ తదితరులు (ఇన్‌సెట్‌లో) బైక్‌పై వెళుతున్న ఎమ్మెల్యే

చిత్తూరు అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కాజూరు చెరువుకు వచ్చే సప్లైఛానల్‌ను బుధవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ బైక్‌పై వెళ్లి పరిశీలించారు. కాజూరు చెరువుకు వచ్చే సప్లైఛానల్ ఆక్రమణలకు గురికావడంతో చుట్టుపక్కల చెరువులన్నీ నిండినా కాజూరు చెరువు ముళ్లచెట్లతో దర్శనమిస్తుందని ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. దాంతో ఎమ్మెల్యే కారు వెళ్లడానికి సరైన దారి లేకపోవడంతో బైక్‌పై వెళ్లారు. కాజూరు చెరువుకు నీరందించాలని లక్ష్యంతో సప్లైఛానల్‌ను శుభ్రం చేసే పనులకు భూమి పూజ చేశారు. వేగంగా పనులను పూర్తి చేసి కాజూరు చెరువుకు నీటిని మళ్లించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, కమిషనర్ నరసింహప్రసాద్, టీడీపీ నేత కాజూరు బాలాజీ, కార్పొరేటర్ అశోక్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతకు జ్ఞాపికను అందిస్తున్న సూపరింటెండెంట్ కోదండపాణి

ఐరాల (కాణిపాకం), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన రాజేంద్రప్రసాద్, స్వరూపరాణి బుధవారం రూ.1,00,500 విరాళంగా అందించారు. విరాళదాతను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు, దర్శనానంతరం దాతలకు స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.

దాతల సహకారం మరువలేనిది



కంప్యూటర్‌ను పరిశీలిస్తున్న సీఈవో దశరథరెడ్డి

ఐరాల (కాణిపాకం), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాణిపాకం జడ్పీ హైస్కూల్‌కు 10 కంప్యూటర్లు, ప్రింటర్‌ను వితరణ చేసిన యాక్షన్ ఫర్ కమ్యూనిటీ సర్వీస్ సొసైటీ నిర్వాహకుల సహకారం మరువలేనిదని హెచ్‌ఎం గోపీనాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఈ కంప్యూటర్లను ఆ సంస్థ సీఈవో దశరథ రెడ్డి, డీఈవో వరలక్ష్మి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి కంప్యూటర్ పరిజ్ఞానాన్ని నేర్చుకుంటే భవిష్యత్తు ఎంతో బావుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మన్ భానుప్రకాష్, వైస్ సర్పంచ్ విశ్వనాథ్, కమిటీ మెంబరు సురేంద్రబాబు, ఆంగ్ల ఉపాధ్యాయుడు సోమశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదాం

గుడిపాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదామని గుడిపాల వైద్యాధికారులు సంధ్య, చంద్రమహేష్ అన్నారు. బుధవారం సీఎన్ఆర్ కళాశాలలో 'చర్చిద్దాం - హెచ్ఐవీని నివారిద్దాం' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి విద్యార్థి అవగాహన కల్గి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ లోకేష్, వైద్యసిబ్బంది చంద్రశేఖర్, సెల్వి, త్రిలోక్, హేమలత, అశోక్, కల్పన, రేవతి, లక్ష్మి, అర్జున, సుజన పాల్గొన్నారు.

టీడీపీ నేతకు పరామర్శ

పూతలపట్టు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పూతలపట్టు మండల మాజీ అధ్యక్షుడు ప్రతాపనేని చంద్రమౌళి తల్లి సరోజమ్మ (75) బుధవారం మధ్యాహ్నం మృతిచెందారు. ఎమ్మెల్యే మురళీ మోహన్, టీడీపీ మండల అధ్యక్షుడు దొరబాబు చౌదరి, జిల్లా అధికార ప్రతినిధి గంగారపు గోపి, ఐరాల మండల మాజీ కన్వీనర్ గిరిధర్ నాయుడు, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర నాయుడు, హరి తదితరులు ఆమె మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబీకులను పరామర్శించారు.

యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక



చంద్ర, వడివేలు

పూతలపట్టు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండల యూటీఎఫ్ యూనియన్ ఎన్నికలు ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ నాయుడు, ఉపాధ్యక్షుడు రెడ్డెప్ప నాయుడు, జిల్లా కార్యదర్శి ఏకాంబరం, రాష్ట్ర కౌన్సిలర్ బాషా, సీనియర్ నాయకులు జ్ఞానశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో బుధవారం జరిగాయి. ఇందులో భాగంగా మండల గౌరవ అధ్యక్షుడిగా చంద్ర, అధ్యక్షుడిగా వడివేలు, ప్రధానకార్యదర్శిగా యోగేశ్వర్ నాయుడు, మండల అసోసియేట్‌గా మునిరత్నం, అసోసియేట్ మహిళ శ్వేత, కోశాధికారి నాగరాజుతో పాటు వివిధ శాఖలకు ఉపాధ్యాయులను ఎన్నుకున్నారు.





చిత్తూరులో అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే గురజాల, కఠారి హేమలత తదితరులు, సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

రాజ్యాంగం పట్ల అవగాహన పెంచుకోవాలి

● ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరుఅర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం చిత్తూరులో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ● దర్గా కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే జగన్మోహన్, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, బీజేపీ నేత అట్లూరి శ్రీనివాసులు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ● దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు మునస్వామి, గోవిందన్, ధనంజయ, ధనరాజ్, చెంగల్రాయులు, కరుణాకరన్, మణిరాజ్, ప్రసాద్, రాజమాణిక్యం తదితరులు పాల్గొన్నారు. ● చుడా కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన తరువాత ఉద్యోగులు, సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. మాజీ కార్పొరేటర్ కంద, రమేష్ బాబు, ఉద్యోగులు పాల్గొన్నారు. ● తవణంపల్లె (ఆంధ్రజ్యోతి): కాణిపాకం క్రాస్‌లో గల శ్రీవినాయక విద్యా మందిరం పాఠశాలలో కరస్పాండెంట్ గణపతినాయుడు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మురళీమోహన్ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు నిర్వహించిన మాక్ అసెంబ్లీ ఆకట్టుకుంది. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారానే ప్రతి ఒక్కరికీ రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సమానత్వం లభిస్తుందన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేష్ చౌదరి, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్ నాయుడు, ఐరాల టీడీపీ అధ్యక్షుడు హరిబాబు నాయుడు, నాయకులు గాలి దిలీప్, గిరిధర్ నాయుడు, రంజీత్ రెడ్డి, గోపి యాదవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం దిక్సూచి



దేశ నాయకుల వేషధారణలో సీబీఎస్ఈ విజయం విద్యార్థులు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం దిక్సూచివంటిదని విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టర్ శైలజామూర్తి అన్నారు. బుధవారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో 76వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి, భారతదేశానికి ఆయన చేసిన సేవలు కొనియాడారు. దేశ నాయకుల వేషధారణలో విద్యార్థులు రాజ్యాంగ విలువలను తెలియజేశారు. ● స్థానిక బృందావన్ పాఠశాలలో కరస్పాండెంట్



బృందావన్‌లో విద్యార్థులచే మాక్ అసెంబ్లీ

శైలజకుమారి, డైరెక్టర్ ప్రియతేజ ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన మాక్ అసెంబ్లీ ప్రదర్శన ఆకట్టుకుంది. ● స్థానిక హార్వర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కరస్పాండెంట్ భాస్కర్, డైరెక్టర్ త్రివేణి ఆధ్వర్యంలో విద్యార్థులు మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ● స్థానిక ఎస్‌పీ సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ ఉషారాణి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. భారత రాజ్యాంగంపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి ఆయా పాఠశాలల యాజమాన్యాలు బహుమతులు అందజేశాయి.

● చిత్తూరు రూరల్(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని అన్ని విద్యాసంస్థల్లో నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం ప్రభుత్వాన్ని కోరారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సంఘ నాయకులు సులోచన, ఓబులేసు, సంతానం, షణ్ముగం, బాబు, మహేష్, రాజేంద్ర, దాము, నాగరాజు, మురగయ్య, సంగీత, కుమారి, మార్కొండ, మహీధర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ● నగరి, (ఆంధ్రజ్యోతి): నగరిలో పలు సంస్థల్లో, సీపీఐ, జైభీమ్ నాయకులు రాజ్యాంగ దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో నగరి మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బాబు, జైభీమ్ నాయకుడు రామచంద్రన్, ఏఐటీయూసీ కార్యదర్శి కోదండయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్షుడిని కలసిన టీడీపీ నూతన మండల అధ్యక్షులు



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడితో ఎమ్మెల్యే థామస్ సహా నూతన మండల అధ్యక్షులు

వెదురుకుప్పం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో బుధవారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులును గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్‌తో కలసి వెళ్లి నియోజకవర్గంలో నూతనంగా నియమితులైన తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ నియమ నిబంధనల మేరకు నడుచుకోవాలని రాష్ట్ర అధ్యక్షుడు సూచించినట్లు నాయకులు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షులు పి.మోహన్‌మురళి(వెదురుకుప్పం), శివనాయుడు (పాలసముద్రం), రుద్రయ్యానాయుడు (పెనుమూరు), స్వామిదాస్ (గంగాధరనెల్లూరు), చెంగల్రాయులయాదవ్ (కార్వేటినగరం), జయశంకర్‌నాయుడు(ఎస్ఆర్‌పురం) ఉన్నారు.

హాస్టల్ విద్యార్థినులకు అవగాహన



విద్యాసామగ్రి అందజేస్తున్న సీఐ నెట్టికంఠయ్య, ఎస్ఐ రమేష్‌బాబు

చిత్తూరు అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక విజయలక్ష్మికాలనీలోని బాలికల బీసీ హాస్టల్‌ను బుధవారం టూటౌన్ సీఐ నెట్టికంఠయ్య సందర్శించారు. విద్యార్థినులకు సైబర్ నేరాలు, పోక్సో చట్టం, మహిళలపై నేరాలు, మాదక ద్రవ్యాల దుర్వినియోగం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చి భద్రతా చర్యలు, చట్టపరమైన పరిణామాలు, తమను తాము రక్షించుకోవడానికి విద్యార్థినులు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల గురించి అవగాహన కల్పించారు. అనంతరం వారికి పెన్నులు, పరీక్షా ప్యాడ్లను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరగాలి



ఎంఓసీలో పాల్గొన్న ప్రముఖులు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఆధ్యాత్మిక, సామాజిక, సాంస్కృతిక నైపుణ్యాలను పెంచాలని నారాయణ విద్యాసంస్థల డీజీఎం కొండలరావు అన్నారు. బుధవారం జిల్లాలోని నారాయణ విద్యాసంస్థలకు సంబంధించి చిత్తూరు కొంగారెడ్డిపల్లిలోని బ్రాంచ్‌లో మాస్టర్ ఓరేటర్ కాంటెస్టు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీఎంలు మాట్లాడుతూ 1-5 తరగతుల విద్యార్థుల్లోని ప్రతిభ, నైపుణ్యాలు వెలికితీయడంతో పాటు సామాజిక బాధ్యత పెంచాలని సూచించారు. అనంతరం విద్యార్థులచే భాషా నైపుణ్యం, వాదనా నైపుణ్యం, శరీర భాష, ప్రసంగాల శైలి ఆధారంగా పోటీలు నిర్వహించి మూల్యాంకనం చేశారు. ప్రతిభ కనపరచిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏజీఎం పణికుమార్, ఆర్ఐలు, కోఆర్డినేటర్లు, బ్రాంచ్ ప్రిన్సిపాల్స్, ట్రైనర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిత్తూరు మార్కెట్ అభివృద్ధికి కృషి

● మంత్రి అచ్చెన్నాయుడు



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న వెంకటేష్‌యాదవ్

చిత్తూరు సెంట్రల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు మార్కెట్ కమిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. టీడీపీ రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి, చిత్తూరు మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ ఝాన్సీరాణి భర్త వెంకటేష్‌యాదవ్, డైరెక్టర్ గంగినాయుడుతో కలిసి బుధవారం మంత్రి నివాసంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్తూరు మార్కెట్ కమిటీ అభివృద్ధికి నివేదికను సమర్పించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ రూ.8.75 కోట్లతో చిత్తూరు మార్కెట్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

వృద్ధురాలిపై దాడి

బంగారుపాళ్యం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిజపల్లెకి చెందిన లేట్ రెడ్డెప్ప భార్య సరోజమ్మ(70)పై అదే గ్రామానికి చెందిన గజేంద్ర మంగళవారం సాయంత్రం దాడి చేశాడు. సరోజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

● రూ.3,440 స్వాధీనం

బంగారుపాళ్యం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.3,440 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. సీఐ కథనం మేరకు... బంగారుపాళ్యం పోలీసుస్టేషన్ పరిధిలోని యాదమరి - బంగారుపాళ్యం సరిహద్దులోని తాళ్లమడుగు అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం రావడంతో సీఐ ఆధ్వర్యంలో ఎస్సై ప్రసాద్, బాబు, ముష్ఫీ, అజగర్‌లు దాడి చేశారు. ఈ దాడిలో బంగారుపాళ్యంకు చెందిన భాస్కర్, పళని, సుబ్రమణ్యంను అదుపులోకి తీసుకోగా, మరికొందరు పరారయ్యారని, వారిని కూడా త్వరలో అదుపులోకి తీసుకుంటామని సీఐ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

గుడిపాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పశుమంద గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం రెండ్రోజుల క్రితం నరహరిపేట క్రాస్ వద్ద కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం బెంగళూరులోని మిలటరి ఆస్పత్రితో చేర్పించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఈ మేరకు గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడితో నాయకులు



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడితో ఎమ్మెల్యే సహా వెదురుకుప్పం, కార్వేటినగరం నాయకులు

వెదురుకుప్పం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులును బుధవారం మంగళగిరిలో ప్రభుత్వ విప్, గంగాధరనెల్లూర ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సహా వెదురుకుప్పం, కార్వేటినగరం నాయకులు కలిశారు. వీరిలో వెదురుకుప్పంకు చెందిన నాయకులు సాతల గుణశేఖర్, శ్రీనాథరెడ్డి, కార్వేటినగరంకు చెందిన మాదిరాజు మురళీకృష్ణ ఉన్నారు.

చీరాల ఎమ్మెల్యేని కలసిన టీడీపీ నాయకులు



వెదురుకుప్పం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం చీరాల ఎమ్మెల్యే కొండయ్యను గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ నాయకులు కలిశారు. నియోజకవర్గ నాయకులు హరీష్, శ్రీనాథరెడ్డి, శివనాయుడు, గంధమనేని రాజశేఖర్‌నాయుడు ఉన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

నగరి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. లేబర్‌కోడ్‌లను వ్యతిరేకిస్తూ బుధవారం పట్టణంలో ఏఐటీయూసీ నేతలు, కార్మికులతో కలసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి వేలన్, ఏఐటీయూసీ నాయకులు బాషా, సతీష్, సుబ్రహ్మణ్యం, నాగరాజు, సిరావుద్దీన్, నందకుమార్, రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

పాలసముద్రం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన సీసీరోడ్ల పనులు, పంచాయతీలకు మంజూరైన ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని మండల ప్రత్యేక అధికారి వెంకటరమణ పేర్కొన్నారు. బుధవారం ఎంఆర్సీ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంగళ్రాజుకుప్పం, పాలసముద్రం సచివాలయాలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ గుర్రప్ప, ఎంపీడీవో సతీష్, జయరాజ్, చీరాలయ్య, శంకర్, డాక్టర్ మోహనకృష్ణ, ఎంఈవో రాజేంద్రప్రసాద్, కార్యదర్శులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి

నింద్ర, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించి పచ్చదనాన్ని పెంపొందించాలని డీఎల్‌డీవో ఇందిరమ్మ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎల్ఎస్ఎల్ ఎస్‌డీజీ థీమ్ 5 పర్యావరణం, పచ్చదనం అనే అంశానికి సంబంధించి మండల స్థాయిలో డ్వాక్రా సభ్యులకు, సంఘ మిత్రలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో శివప్రసాద్‌వర్మ, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, లక్ష్మయ్య, అరుణాచలం పాల్గొన్నారు.